# జనబలం

ప్రజలే ప్రభువులు

అక్టోబర్ 2025 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-




## 'వే 2 న్యూస్' విజయవాడ కాంక్లేవ్

సంక్షోభం

మేకిన్ ఇండియా గ్రేట్ ఎగైన్

అవకాశం




సమాచార హక్కు చట్టం @ 20

రైతులు
VS
ఐ.టి. ఉద్యోగులు

## ప్రభుత్వానికి ట్యాక్స్‌లు-ప్రయివేటు స్కూళ్లకి 10 రెట్లు ఫీజు లా?

# పీవీ, మన్మోహన్‌ల లక్ష్యం అసంపూర్ణం



మాజీ ప్రధానమంత్రులు పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్‌సింగ్‌లు ఆర్థిక సంస్కరణల ద్వారా కలలుగన్న సమ్మిళిత అభివృద్ధి ఇంకా అసంపూర్ణంగానే ఉందని ప్రజాస్వామ్యపీఠం(ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న భారత ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పిన మహామనిషి పీవీ అని ప్రస్తుతించారు. సొంత పార్టీ నుండి, ప్రతిపక్షాల నుండి తీవ్ర విమర్శలను ఎదుర్కొంటూ కూడా చాకచక్యంగా ఈ సంస్కరణల్ని ప్రారంభిం చారన్నారు. “మార్పుకి సమయం ఆసన్నమైనప్పుడు, మోహరించిన సైన్యాలు కూడా ఆపలేవు” అంటూ ఆరోజు పీవీ కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా పనిచేసిన మన్మోహన్‌సింగ్ ఒక డ్రీమ్ బడ్జెట్‌తో భారత శక్తిసామర్థ్యాలను ప్రపంచీ కరించారన్నారు. ఆయన కీర్తి గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదన్నారు. పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఎకనామిక్స్ అవార్డును మాజీ ప్రధాని మన్మోహనసింగ్ సతీమణి గురుచరణ్ కౌర్‌కు అందచేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు రామచంద్రమూర్తి, జేపీతోపాటు గౌరవ సలహాదారుగా



వ్యవహరిస్తున్న విజయ్‌బాబు, ప్రణాళికాసంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా, మన్మోహన్ కుమార్తెలు ఉపీందర్‌సింగ్, దమన్‌సింగ్ పాల్గొన్నారు. పీవీ, మన్మోహన్ స్ఫూర్తిని గుర్తుచేయటానికే ఈ అవార్డులు అందిస్తున్నామని, తాత్కాలిక పథకాలతో ప్రజల్ని మభ్యపెట్టకుండా ఆర్థిక సంస్కరణల్లో, సంపద సృష్టిలో సామాన్యులను కూడా భాగస్వాముల్ని చేయాలని రాజకీయ పార్టీలకు ఈ సందర్భంగా జేపీ విజ్ఞప్తి చేశారు.



# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

అక్టోబర్ 2025

సంపుటి 27 సంచిక 10


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కు IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.


06 ఆర్థిక క్రమశిక్షణ, చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య.. సంక్షోభాన్ని 'MIGA'గా మలిచే ఫార్ములా


09 వే 2 న్యూస్ విజయవాడ కాంక్లేవ్.. యువత – విద్య, ఆరోగ్యంపై చర్చ

15 అమలులో లోపం.. నిర్వీర్యమవుతున్న చట్టం

30 పోస్టాఫీసుల్ని శాశ్వత ఓటరు నమోదు కేంద్రాలు చేయండి..

32 రైతులు VS ఐ.టి. ఉద్యోగులు


**కార్టూన్ కార్నర్**




ఈ ఎన్నికలు మరీ ఐదేళ్లకు ఒకసారే ఎందుకు జరుగుతాయి? ఏటా జరిగితే బాగుండును కదా..!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యాయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# జి.ఎస్టీ.2.0 సంస్కరణలు!
# ఆలస్యమే అయినా అవసరం!

వ్యాపారులకు సులభతరమైన వాణిజ్యం, ప్రజలకు సులభమైన జీవనం లక్ష్యాలుగా జి.ఎస్టీ. 2.0 సంస్కరణలు తీసుకువచ్చినట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. జి.ఎస్టీ.లో రెండోతరం సంస్కరణలు అవసరమని గత కొన్నేళ్లుగా మార్కెట్ వర్గాలనుండి, వినియోగదారుల నుండి పెద్ద ఎత్తున డిమాండ్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

మొన్న సెప్టెంబరు మూడో తేదీన జరిగిన జి.ఎస్టీ. కౌన్సిల్ 56వ సమావేశంలో 2.0 సంస్కరణలకు ఆమోదం లభించింది. దీంతో ఇటు వినియోగదారులకు కొన్ని రాయితీలు లభించగా, వ్యాపారం చేయడానికి వ్యాపార, వాణిజ్య వర్గాలకు కొంతమేరకు సౌలభ్యం లభించింది. కొత్త సంస్కరణల వల్ల పన్నుల చట్రం మరింత సులభం అవుతుందని ఆశిస్తున్నారు. పన్నుల వ్యవస్థలో చోటుచేసుకున్న అసమర్థతలను తొలగించడం కూడా రెండోతరం సంస్కరణల ఉద్దేశ్యమని ఆర్థికవేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

దేశంలోని ఆర్థిక కార్యకలాపాలను ఉత్తేజపరచడం, పాత జీఎస్టీ విధానంలో దీర్ఘకాలిక వ్యూహాత్మక పరివర్తనను తీసుకురావడం అవసరమని జి.ఎస్టీ. కౌన్సిల్ 56వ సమావేశం భావించింది. నష్టాలకు ఆస్కారమున్న వ్యాపారాల రిజిస్ట్రేషన్‌ను మరింత వేగవంతంగా, సులువుగా చేయాలన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని జి.ఎస్టీ. పాలనా పద్ధతుల్లో కీలక మార్పులు తెచ్చేందుకు కౌన్సిల్ సంసిద్ధం అయ్యింది.

ఎగుమతిదారులకు త్వరితగతి చెల్లింపులు చేయడం అవసరమన్న డిమాండ్‌ను కూడా కౌన్సిల్ పరిగణన లోనికి తీసుకున్నది. ఇప్పటివరకూ 5శాతం, 12శాతం, 18శాతం, 28శాతం పేరిట నాలుగు స్లాబుల విధానం అమల్లో ఉన్నప్పటికీ వేర్వేరు రూపాల్లో ఇంకా బహుళ పన్నుల వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది.

రెండోతరం సంస్కరణల ద్వారా 5శాతం, 18శాతం పన్నులతో రెండు స్లాబుల విధానం అమల్లోకి వచ్చింది. స్లాబుల తగ్గింపు వల్ల పలు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని, వినియోగదారులకు ఊరట లభిస్తుందని ఆర్థికమంత్రి చెప్పారు. అయితే మార్కెట్లో వీటి అమలును గట్టిగా పర్యవేక్షించి లబ్ది వినియోగదారులకు అందేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని మరచి పోరాదు.

అయితే విలాస వస్తువులు, పొగాకు, పాన్ మసాలా వంటి వ్యసన వస్తువులపై 40 శాతం పన్ను విధించే స్లాబ్ ఒకటి ఇంకా కొనసాగుతున్నది. అసలు పన్నులు అంటూ లేని వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలు, పాలు, పనీర్ వంటి నిత్యావసర వస్తువుల జాబితా కూడా మరొకటి కొనసాగుతున్నది. ముందు నుండి జి.ఎస్టీ. పరిధిలో లేని వస్తువులు, సేవలు ఉన్న సంగతి తెలిసిందే.

ఉదాహరణకు మద్యం, విద్యుత్ సరఫరా పన్నులు ఇప్పటికీ రాష్ట్రాల చేతిలోనే ఉన్నాయి. పెట్రోలు, హై స్పీడ్ డీజిల్, క్రూడాయిల్, విమాన ఇంధనం, సహజ వాయువు వంటివి కూడా జి.ఎస్టీ.పరిధిలో లేవు. వీటిని కూడా జి.ఎస్టీ. పరిధిలోకి తేవాలన్న డిమాండు చాలాకాలంగా ఉంది. జాతీయ ప్రభుత్వం అందుకు ఇప్పటికీ సిద్ధంగా లేదు.

తాజా ప్రతిపాదనల ప్రకారం ముప్పై మూడు రకాల ప్రాణరక్షక మందులపై గతంలో ఉన్న 12 శాతం పన్ను పూర్తిగా రద్దు అయ్యింది. కాన్సర్ చికిత్సకు, అరుదైన వ్యాధుల చికిత్సకు వినియోగించే మూడు రకాల మందులపై గతంలో ఉన్న 5 శాతం పన్ను కూడా పూర్తిగా రద్దు అయ్యింది.

దేశంలో తయారీ రంగాన్ని ఉత్తేజ పరచడానికి, దేశీయ మార్కెట్లో డిమాండును పెంచడానికి, హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడానికి కొన్ని పన్నుల్లో కోతను విధించారు. అందులో చిన్నకార్లు, టీవీలు, ఎయిర్ కండిషనర్లు, సిమెంటు, మోటారు వాహనాల విడిభాగాలు, పునరుత్పాదక ఇంధనం వంటివి ఉన్నాయి. వాటిపై పన్ను 28 శాతం నుండి 18 శాతానికి తగ్గుతుంది.

వ్యవసాయానికి, గ్రామీణ రంగానికి మద్దతు ఇచ్చే లక్ష్యంతో ట్రాక్టర్లు, పంటకోత యంత్రాలు, వ్యవసాయ

పరికరాలు, సేంద్రియ ఎరువుల తయారీపై పన్ను 12 శాతం నుండి 5 శాతానికి తగ్గింది. అయితే వీటిని పూర్తిగా తీసే యాలన్న రైతుల డిమాండుకు పూర్తి ఆమోదం రాలేదు. తమకు వెనక్కు ఇచ్చే ఇన్‌పుట్ క్రెడిట్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని వ్యాపార వర్గాలు గత కొన్నేళ్లుగా అసంతృప్తి చెందుతున్నాయి. కొన్నిరకాల నష్టదాయక వ్యాపారాల రిజిస్ట్రేషన్లో కూడా జాప్యం కొనసాగుతోంది. జి.ఎస్టీ.పై వివాదాల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం పలు సందర్భాల్లో కోర్టుల వరకూ పోతున్నది. కోర్టుల్లో పరిష్కార ప్రక్రియకు సహజంగానే సుదీర్ఘకాలం పడుతున్నది.

వ్యాపార వర్గాల సౌలభ్యం కోసం వివాద పరిష్కార యంత్రాంగాన్ని, పద్ధతుల్ని సరళం చేయాలన్న డిమాండు చాలా కాలంగా ఉంది. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావడం లేదన్న వాస్తవం కంటి ముందు కనిపిస్తూనే ఉంది. లక్షల సంఖ్యలో అవి మూతపడిపోవడం చూస్తూనే ఉన్నాం. నోట్లరద్దు ప్రయోగం, కరోనా మహమ్మారి ఎం.ఎస్.ఎం.ఇ. సంస్థల నడ్డి విరిచాయి. జి.ఎస్టీ. వ్యవస్థ ద్వారా అయినా వాటికి తగిన మద్దతు ఇవ్వాలన్న డిమాండు గత కొన్నేళ్లుగా ముందుకు వచ్చింది. ఎట్టకేలకు జి.ఎస్టీ. కౌన్సిల్ ఈ సమస్యపై దృష్టి సారించింది. డిసెంబర్ 2025 నాటికి గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ పేరిట ఒక వ్యవస్థ పని చేయడం ప్రారంభిస్తుందని జి.ఎస్టీ. కౌన్సిల్ హామీ ఇచ్చింది.

ప్రస్తుత సంస్కరణల వల్ల ఏటా 60 వేల కోట్ల రూపాయల మేరకు పన్నుల రాబడి తగ్గుతుందని అంచనా. దాంతో జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలకు ద్రవ్య ఒత్తిడి పెరుగుతుంది. ప్రభుత్వాలు బడ్జెట్ వ్యయాలు సర్దుబాటు చేసుకోవడమో, అప్పులు తేవడమో చేయాల్సి వస్తుంది. ఆమేరకు మౌలిక సదుపాయాల కల్పనకు కోతపడుతుంది. సంక్షేమం పేరుతో ప్రభుత్వాల విచక్షణారహిత విధానాలపై ఎలాంటి అదుపు లేని రోజుల్లో రాబడి తగ్గుదల అప్పులకు దారి తీస్తుంది. చిరకాలంగా గందరగోళంగా, సంక్లిష్టంగా కొనసాగుతున్న భారతీయ పన్నుల వ్యవస్థను సరళతరం చేయడం కోసమే 2017 జులై 1వ తేదీ నుంచి జి.ఎస్టీ. అమలులోకి వచ్చింది.

"ఒకే దేశం–ఒకే పన్ను" నినాదంతో 101వ రాజ్యాంగ సవరణ ద్వారా జి.ఎస్టీ.కి రాజ్యాంగబద్ధత లభించింది. స్లాబుల సంఖ్యను తగ్గించాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళతరం చేయాలని, జి.ఎస్టీ. యంత్రాంగాన్ని మరింత ప్రజాస్వామికీకరణ చేయాలని, మినహాయింపు లేకుండా అన్ని వస్తు సేవలను జి.ఎస్టీ. పరిధిలోకి తేవాలని గత ఏడెనిమిదేళ్లుగా పౌరసమాజమూ, వ్యాపారవర్గాలు, రైతాంగం, వినియోగదారీ సమాజమూ, ప్రతిపక్షాలు కోరుతూనే ఉన్నాయి.

రాష్ట్రాల అధికారాలకు, పన్ను రాబడిలో రాష్ట్రాల వాటాలకు రక్షణ కల్పించాలని రాష్ట్రాల ప్రభుత్వాలు కోరుతూనే ఉన్నాయి. జి.ఎస్టీ. విధానాన్ని ప్రవేశపెట్టిన 2017 –18 సంవత్సరంలో పది నెలలకు 7 లక్షల 20 వేల కోట్ల రూపాయలు వసూలు అయ్యాయి. కరోనా మహమ్మారి ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసిన 2020–21 సంవత్సరాల్లో సైతం 11 లక్షల 36 వేల కోట్ల రూపాయల వసూళ్లు అయ్యాయి. 2025 ఆగస్ట్ వరకూ వసూళ్లు 22 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఆర్థిక కార్యకలాపాలు పెరగడం, పన్నుచెల్లింపు పరిధి విస్తృతం కావడం ఇందుకు కారణాలు అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే పన్నుల పంపిణీ సవ్యంగా లేదన్నది కూడా ఒక వాస్తవం.


మొత్తం జి.ఎస్టీ.లో ఐ.జి.ఎస్.టి. 36శాతం, ఎస్.జి.ఎస్.టి. 30.8శాతం , సి.జి.ఎస్.టి. 24.7శాతం, సెస్సులు 8శాతం ఉన్నాయి. ఐ.జి.ఎస్.టి. వసూళ్ళలో, సెస్సులలో రాష్ట్రాలకు రావాల్సిన వాటాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రారంభంలో ఉన్న రాష్ట్రాల వాటా శాతంలో కోత పడింది. దాంతో రాష్ట్రాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయి. జి.ఎస్టీ. కౌన్సిల్లో రాష్ట్రాల మాట చెల్లుబాటు కాకపోవడం కూడా సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. రాష్ట్రాలకు జి.ఎస్టీ. చట్టం ఇచ్చిన వెయిటేజీలను లెక్క చేయకపోవడం, రాష్ట్రాల అధికారాలు కుదించుకుపోవడం "ఒకే దేశం –ఒకే పన్ను" స్ఫూర్తికి మార్గావరోధాలుగా ఉన్నాయి. అందుకోసం జి.ఎస్టీ.లో మరిన్ని సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉంది.

డి. సోమ సుందర్

# ఆర్థిక క్రమశిక్షణ, చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య.. సంక్షోభాన్ని 'MIGA' గా మలిచే ఫార్ములా

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**

*స్టాన్‌ఫర్డ్ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత పాల్ రోమర్ మాటల్లో 'MIGA' "సంక్షోభం అనేది ఎట్టి పరిస్థితుల్లోనూ వృధా చేయకూడని అవకాశం". ఒక సంక్లిష్ట, పోటీ రాజకీయార్థిక వ్యవస్థలో అవసరమైన సంస్కరణల్ని అమల్లోకి తేవటానికిసంక్షోభం తరచూ ఒక వెసులుబాటు లాంటిది. ఊపిరి పీల్చుకునే వ్యవధిని అందిస్తుంది. ట్రంప్ సుంకాల మోత పుణ్యమా అనిమనకు సంబంధంలేని ఓ సంక్షోభం వచ్చి మన నెత్తిన పడింది. ఇది 1991లో మనం ఎదుర్కొన్నంత భయంకర సంక్షోభం కాదుగానీ, ఇదీ ఒక సంక్షోభమే.*



ప్రస్తుత ఏకపక్షసుంకాల తాకిడి త్వరలో ఆమోద యోగ్యంగా పరిష్కారమయ్యే అవకాశముంది. ఇది దురాశేమీ కాదు. అయితే ఈలోగా సవాలును ఎదుర్కోక తప్పదు. ఇందుకోసం యూనియన్ ప్రభుత్వం ఇప్పటికే సన్నద్ధతను ప్రకటించింది. సాధ్యమైన, అవసరమైన ప్రతి చర్యా మన ప్రభుత్వం తప్పక తీసుకుంటుందని భావించవచ్చు.

దశాబ్దకాలంగా ఆర్థిక క్రమశిక్షణను నిల కడగా పాటించటం, ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మెరుగుపడటం, మౌలిక వస తులకు రికార్డు స్థాయి కేటాయింపులు, పెట్టుబడి వ్యయాల్ని భారీగా పెంచటం.. దేశ ప్రయోజనాలకి మంచి ఊతాన్నిచ్చాయి. ముఖ్యంగా ఉపాధి అవకాశాలను ఎక్కువగా కల్పించే వస్త్రాలు, జౌళి, రొయ్యల పెంపకం, ముత్యాలు, ఆభరణాల తయారీ రంగాల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ సమస్యల్ని పరిష్కరించే సంకల్పం,సామర్థ్యం ప్రభుత్వానికి ఉన్నాయి.

కానీ ద్రవ్యపరమైన చర్యలను మించి విజ్ఞతను ప్రభుత్వం ప్రదర్శించాలి. ఇప్పటికి కూడా మన వస్తు ఎగుమతులు జీడీపీలో 10-12% మాత్రమే ఉన్నాయి. ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ ప్రమాణాల ప్రకారం ఇది తక్కువ. చైనా వస్తు ఎగుమతులు 2006లోనే జీడీపీలో 35 శాతానికి పైగా ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా తగ్గుతూ వస్తున్నా, జీడీపీలో 20% కంటే తగ్గలేదు. ఆ రకంగా చూస్తే, మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వాణిజ్యంపై తక్కువ ఆధారపడి ఉంది. దేశీయ వినియోగమే మన ఆర్థిక రంగాన్ని ఎక్కువగా నడిపిస్తోంది. కాబట్టి, మరీ ఎక్కువ నష్టం లేకుండా ప్రస్తుత కష్టాల్ని మనం తట్టుకోగలం.

అయితే, తక్షణ సమస్య గట్టెక్కితే చాలదు.అంతవరకే స్పందించి ఆ తర్వాత అంతా బాగుందన్నట్లు యధాతథ తీరును కొనసాగించటం పొరపాటు. మనకు అంతర్గతంగా అనేక అవరోధాలున్నాయి. ఉత్పాదకత, పెట్టుబడి, అభివృద్ధికి సవాళ్లు ఎదురవుతున్నాయి. అభివృద్ధికున్న ఈ అవరోధాలను గుర్తించి సమూలంగా తొలగించ టానికి ఇదో మంచి అవకాశం.

సుమారు రెండు దశాబ్దాల క్రితం నేను అట్లాంటాలో రెవరెండ్ లారెన్స్ కార్టర్ జూనియర్‌తో సుదీర్ఘ చర్చ జరిపాను. ఆయన పేరొందిన పౌరహక్కుల నాయకులు. మార్టిన్ లూథర్ కింగ్ ఇంటర్నేషనల్ ఛాపెల్‌కు డీన్. మేం చేస్తున్న కార్యక్రమాల మీద మా ఆలోచనల్ని పంచుకున్నాం. ఆఫ్రికన్ అమెరికన్ జనాభాకు ఎదిగే అవకాశాలు, భారత ప్రజాస్వామ్యంలో సంస్కరణల మీద అన్నమాట. సమావేశం ముగింపులో రెవరెండ్ కార్టర్ చేసిన ఓ వ్యాఖ్య నాకు ఇప్పటికీ గుర్తుంది. "అమెరికాలో మాకున్న సవాలు మీతో పోలిస్తే స్వల్పం. తేలిగ్గా ఎదుర్కోగలిగినది. ఒక ప్రజాస్వామ్యంలో, ఆఫ్రికన్ అమెరికన్లలో మేం చైతన్యాన్ని పెంచుతాం, సమీకరిస్తాం, ఎన్నికల్లో పోటీ చేస్తాం, మార్పు కోసం ఓటు వేస్తాం. అంతే! పరిస్థితులు మెరుగుపడతాయి. రాజకీయాలు మాకు పరిష్కారం. కానీ, మీ విషయంలో, రాజకీయాలే సమస్యగా కనిపిస్తున్నాయి" అన్నారు. అద్భుత సునిశితత్వంతో చేసిన వ్యాఖ్య! ప్రజాస్వామ్యం రాజకీయ కుస్తీ పోటీ స్థాయికి దిగజారినప్పుడు, ఏ వెలుగుల కోసమో తెలియని అవధుల్లేని అధికార లాలసగా తయారైనప్పుడు.. ఆర్థిక, సామాజిక, పాలనా రంగాలలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. పంతొమ్మిదో శతాబ్దపు రాజకీయాలు ఇరవై ఒకటో శతాబ్దపు




ఆర్థిక వ్యవస్థ కలసి సాగలేవు. రాజకీయ నిష్క్రియ అంతిమంగా ఆర్థిక వ్యవస్థకి పెద్దబండగా మారుతుంది.

ప్రజల అవసరమే పెట్టుబడిగా అధికార దుర్వినియోగంతో తెలంగాణలో అవినీతికి పాల్పడిన ఇటీవలి ఓ ఉదంతం ఇందుకు పెద్ద ఉదాహరణ.

రాష్ట్రం యూరియా కొరతతో సతమతమవుతోంది. రైతులు పగలనక రాత్రనక బారులు తీరి సొమ్మసిల్లుతున్నారు. సహనం కోల్పోయి బాహాబాహీకి సైతం దిగుతున్నారు. రామగుండం వద్ద ఎరువుల కర్మాగారం ఉంది. అది యూనియన్ ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట ప్రభుత్వ వాటా గల ఉమ్మడి యాజమాన్య కర్మాగారం. యూరియాను తయారుచేస్తుంది. ఏదో ఉత్పత్తి సమస్య వచ్చి కర్మాగారాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మరమ్మతులు చేయటానికి కాంట్రాక్టర్‌ని ఎంపిక చేశారు. అయితే ఓ శాసనసభ్యుడు ఆ మరమ్మతుకి అడ్డుపడ్డారు. నా వాటా నాకిచ్చేంత వరకూ పనులు మొదలుపెట్టటానికి వీల్లేదు! అని అడ్డుకున్నారు. యూరియా కొరతను నిరసిస్తూ రైతులు చేస్తున్న ఆందోళనలతో అప్పటికే తలలు పట్టుకున్న రాష్ట్ర మంత్రులు..సదరు శాసనసభ్యునితో చర్చలు జరిపి, మరమ్మతుల్ని అడ్డుకోవద్దని బతిమిలాడుకోవాల్సి వచ్చింది!

చాలా రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చు చుక్కల్ని తాకుతోంది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో అసెంబ్లీకి ఒక్కో ప్రధాన పార్టీ అభ్యర్థి చేస్తున్న ఖర్చు రూ.25 నుంచి 30 కోట్ల దాకా ఉంటోంది. కొన్ని నియోజకవర్గాలలో ఇది రూ.50 కోట్లు, ఇంకా ఎక్కువ కూడా ఉంటోంది. మన ఎన్నికల్లో చట్టవిరుద్ధంగా లెక్కలు చెప్పని డబ్బు వినియోగాన్ని తగ్గించటంలో పార్టీలు నిస్సహాయంగా మారాయి. విషవలయంలో కూరుకుపోయాయి. ఈ ఖర్చులో చాలామేర డబ్బు పంపిణీకే వెచ్చించాల్సి వస్తోంది. ఒక్కో ఓటరుకి రూ.2,000 నుంచి 5,000 దాకా పంచుతున్నారు. అంత

**చాలా రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చు చుక్కల్ని తాకుతోంది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో అసెంబ్లీకి ఒక్కో ప్రధాన పార్టీ అభ్యర్థి చేస్తున్న ఖర్చు రూ.25 నుంచి 30 కోట్ల దాకా ఉంటోంది. కొన్ని నియోజకవర్గాలలో ఇది రూ.50 కోట్లు, ఇంకా ఎక్కువ కూడా ఉంటోంది. మన ఎన్నికల్లో చట్టవిరుద్ధంగా లెక్కలు చెప్పని డబ్బు వినియోగాన్ని తగ్గించటంలో పార్టీలు నిస్సహాయంగా మారాయి. విషవలయంలో కూరుకుపోయాయి.**

పెద్ద మొత్తాలు పంచినా ఎన్నికల్లో గెలుపుకి గ్యారంటీ లేదు! సదరు అభ్యర్థి పోటీలో ఉన్నట్లు ఓటర్లు అనుకుంటారంతే. అంటే, అటువంటి వ్యయం ఎన్నికల రాజకీ యానికి "ప్రవేశ రుసుము"గా మారింది.

ఎక్కువ ఖర్చు పెడితే గెలుస్తారని గ్యారంటీ లేదు. కానీ డబ్బు పంచకపోతే మాత్రం ఓటమి ఖాయం! మిగతా చాలా రాష్ట్రాలు కూడా ఇదే బాటలోకి వస్తున్నాయి. అభ్యర్థులు, పార్టీల కోసం ఎన్నికల వ్యయాన్ని అమాంతం పెంచేస్తున్నాయి. గ్రేషమ్స్ సూత్రం (అంకెల్లో విలువ సమానమైనా.. మార్కెట్ లో లోహం లేదా మారకద్రవ్య పరంగా ఎక్కువ విలువున్న నాణాలు లేదా నోట్లను దాచిపెట్టి,తక్కువ విలువున్న నాణాలు, నోట్లను చెలామణి చేయటం) లాంటిది రాజకీయాల్లోనూ పనిచేస్తోంది. ఉన్న కొద్దిపాటి మంచి ధోరణుల్ని కూడా చెడు పోకడలు కాలక్రమేణా పక్కకు నెట్టేస్తాయి.

ఈ సంక్లిష్ట రాజకీయం వల్లే.. ఆర్థిక కలాపాలకు, సంపద సృష్టికి కాలక్రమంలో అనేక అవరోధాలు ఏర్పడ్డాయి. అసంబద్ధమైన ప్రాజెక్టుల మీద అడ్డగోలు వ్యయాలు ఆనవాయితీగా మారింది. అసాధారణ అవినీతి, దోపిడీలకు అవి



ఏటీఎంలుగా మారాయి. ఆర్థికాభివృద్ధికి భరోసా లేక పోవటం,నాణ్యమైన పౌర సేవలు కొరవడటం పట్ల ఓటర్లలో పేరుకుపోయిన కోపాన్ని చల్లార్చేందుకు తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాల్ని చిట్కాగా పార్టీలు ఎంచుకున్నాయి. అయితే ఒక చిట్కా ఒక ఎన్నికకే పనిచేస్తుండటంతో..కొత్త ఎన్నికలో పాత ఎన్నిక కంటే ఎక్కువ ఎర వేయాల్సి వస్తోంది. దీంతో సంక్షేమం పేరుతో తాత్కాలిక తాయిలాలు పోటా పోటీగా, అడ్డూఆపూ లేకుండా, అదే పరిపాలన అన్నట్లు సాగుతున్నాయి.

తాత్కాలిక సంక్షేమ పథకాలలో కొట్టుమిట్టాడుతూ ప్రభుత్వం తాను నిజంగా అందించాల్సిన సేవల్లో విఫలమవటం వల్ల ప్రథమంగా మూల్యం చెల్లించింది పాఠశాల విద్య.

ప్రభుత్వ స్కూళ్లలో విద్య కోసం మనం భారీగా పన్నుల డబ్బు ఖర్చు చేస్తున్నాం. కానీ ఫలితాలు మాత్రం అత్యంత అధ్వాన్నం. ఈ పనికిమాలిన బడి చదువుల వల్ల యువతలో అనేకమంది ఆధునిక ఆర్థిక వ్యవస్థకి అవసరమైన నైపుణ్యాల్ని అందుకోలేక నిరుద్యోగంలో కూరుకు పోతున్నారు. రిజర్వేషన్లను ఇంకా పెంచటం, ప్రభుత్వో ద్యోగాల్లో నియామకాలు కంటితుడుపు చర్యలు మాత్రమే. వాటితో యువత ఎలా సంపద సృష్టికర్తలవుతారు? భూ, కార్మిక చట్టాల్లోని విపరీత నియంత్రణలు కొత్తగా పరిశ్రమ లేదా వ్యాపారం ప్రారంభించాలనుకునేవారిని ముప్పుతిప్పలు పెడుతున్నాయి. పెట్టుబడి అంటే పాపంగా, ఖరీదైన, పోటీకి తట్టుకోలేని వ్యవహారంగా తయారైంది.

తాత్కాలిక సంక్షేమ పథకాలలో కొట్టుమిట్టాడుతూ ప్రభుత్వం తాను నిజంగా అందించాల్సిన సేవల్లో విఫలమవటం వల్ల ప్రథమంగా మూల్యం చెల్లించింది పాఠశాల విద్య. ప్రభుత్వ స్కూళ్లలో విద్య కోసం మనం భారీగా పన్నుల డబ్బు ఖర్చు చేస్తున్నాం. కానీ ఫలితాలు మాత్రం అత్యంత అధ్వాన్నం. ఈ పనికిమాలిన బడి చదువుల వల్ల యువతలో అనేకమంది ఆధునిక ఆర్థిక వ్యవస్థకిఅవసరమైన నైపుణ్యాల్ని అందుకోలేక నిరుద్యోగంలో కూరుకుపోతున్నారు.

పట్టణీకరణ అంటే మహానగరాలే అనుకోవటం వల్ల మితిమీరి ఒత్తిడితో అవి కిక్కిరిసిపోతున్నాయి. విస్తరణేమో పరిమితంగా ఉంటోంది. స్థానికంగా ఎక్కడికక్కడ చిన్న పట్టణాల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే పరిశ్రమల స్థాపన కొరవడటం వల్ల పట్టణీకరణ నత్తనడకన, పద్ధతీ ప్రణాళికా లేకుండా జరుగుతోంది. చట్టబద్ధపాలన బలహీనంగా ఉండటంతో, గూండాలు అప్రకటిత జడ్జీలయ్యారు. పైసలు తీసుకుని తక్షణ బంద న్యాయం అందించటం సర్వత్రా సాధారణమైంది.

మన ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలంటే, మనకు మనం కల్పించుకున్న ఈ ఉచ్చు నుంచి బయట పడాలి. అందుకోసం రాష్ట్రాల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. నిజమైన నైపుణ్యాలనిచ్చే నాణ్యమైన విద్యను అందించాలి. భూ, కార్మిక చట్టాల్ని సవరించాలి. గ్రామాల మధ్య చిన్న పట్టణాల్ని ఆర్థిక, ఉపాధి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. పెట్టుబడులు, ఆదాయాల పెరుగుదలకు భరోసా ఇచ్చే స్థాయిలోనైనా చట్టబద్ధపాలనను అమలు చేయాలి.

మన ఆర్థిక వ్యవస్థను, సమాజాన్ని వచ్చే పాతికేళ్లపాటు మరింత సుస్థిరాభివృద్ధి పథంలోకి తీసుకెళ్లటానికి, 'మేకిన్ ఇండియా గ్రేట్ ఎగైన్' (MIGA)కి ఈవేళ్టి సంక్షోభం మనకు మరో గొప్ప అవకాశం. ✶

# సీబీఐ అధికారులపై పెండింగులో 60 కేసులు

కేంద్ర అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన 'సీబీఐ' అధికార్లపై శాఖాపరమైన చర్యలకు ఆస్కారమున్న 60 కేసులు డిసెంబరు 31, 2024 నాటికి పెండింగులో ఉన్నాయని కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) వెల్లడించింది. ఇందులో 22 కేసుల్లో నాలుగేళ్ల శిక్షకు వీలుందని కమిషన్ తాజా నివేదిక తెలియజేసింది. "సీబీఐ అధికారులపై పెండింగులో ఉన్న కేసులు దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థ కీర్తి ప్రతిష్ఠలు ఏ దశలో ఉన్నాయనడాన్ని ప్రతిబింబిస్తున్నాయి" అని సీవీసీ విడుదల చేసిన 2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదిక తెలియజేస్తోంది. 2024 డిసెంబరు 31 నాటి గ్రూప్ ఏ అధికారులపై 39 శాఖాపరమైన కేసులు, గ్రూప్ బీ, గ్రూప్ సీ అధికారులపై 21 కేసులు పెండింగులో ఉన్నాయని నివేదిక తెలియజేసింది.

# వే 2 న్యూస్ విజయవాడ కాంక్లేవ్..
# యువత - విద్య, ఆరోగ్యంపై చర్చ




***డిజిటల్ మీడియాలో పేరొందిన 'వే 2 న్యూస్' సంస్థ విజయవాడలో సెప్టెంబర్ రెండవ వారంలో కాంక్లేవ్ నిర్వహించింది. ఇందులో 'వచ్చే 10 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ విజన్ ఏమిటి, ఎలాంటి అభివృద్ధి, మార్పులను తీసుకురాబోతోంది' ప్రధాన చర్చాంశం. ఇంతకంటే పెద్ద వార్త ఏమిటంటే, ఈ కాంక్లేవ్ లో రెండు ప్యానల్ డిస్కషన్లు విద్య (యువత నేపథ్యంలో), ఆరోగ్యం మీద జరిగాయి. భారతదేశానికి స్వతంత్రం వచ్చాక గత 78 ఏళ్లలో పార్లమెంటు ఈ రెండు మౌలికాంశాల మీద లోతైనచర్చ చేసిన సందర్భాలు చాలా తక్కువ. బహుశా జాతీయ మీడియా కాంక్లేవ్ లలో కూడా ఇలాంటి చర్చ లేదు. కానీ విజయవాడ కాంక్లేవ్ లో ఆ డిజిటల్ ఛానల్ ఈ ఏర్పాటు చేసి, జేపీ సమన్వయకర్తగా నిర్వహించింది. ఇందులో చర్చకొచ్చిన, జేపీ లేవనెత్తిన అంశాలు రెండు తెలుగు రాష్ట్రాలకు, మొత్తం భారతదేశానికీ కాస్త అటూ ఇటుగా వర్తిస్తాయి.***

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలూ 'రైజింగ్ తెలంగాణ', 'స్వర్ణాంధ్ర' లక్ష్యాలను నిర్దేశించుకుని రోడ్ మ్యాప్‌ను విడుదల చేశాయి. అయితే అది కాస్త దీర్ఘకాలం కాబట్టి, వచ్చే పదేళ్ల గురించి చెప్పండంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును సదస్సులో ఒక సీనియర్ జర్నలిస్టు ప్రశ్న అడిగి చర్చను ప్రారంభించారు. ప్రధానంగా ముఖ్యమంత్రి.. సాంకేతికాభివృద్ధి, ఆర్థికప్రగతి, తలసరి ఆదాయం పెరుగుదల, పోల వరం, అమరావతి తదితర అంశాలను ప్రస్తావించారు. తీవ్ర అప్పుల సంక్షోభంలో ఉండి కూడా దేశ చరిత్రలోనే ఎక్కడాలేని స్థాయిలో అమలు చేస్తున్న తాత్కాలిక తాయి లాలను సమర్థించుకున్నారు. ఇంకా ఎక్కువమంది పిల్లల్ని కనాలని చెప్పుకొచ్చారుగానీ.. వారు ఎదగటానికి కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం గురించి మాట్లాడలేదు. సంపదను బొట్లు బొట్లుగా పంచటం (ట్రికిల్ డౌన్) కాకుండా, కాస్త భారీగా పంచటం అదనపు జనాభాకి పరిష్కారంగా ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు కనిపిస్తుంది. ఆదాయం పెరిగితే, పంచుడు పెరుగుతుందని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. 'మీరు క్వాంటమ్ వ్యాలీ దాకా, ఎన్నిటిలోనో తలదూర్చి చివరకు ఏదీ సరిగా పూర్తిచేసే పరిస్థితి ఏర్పడదు గదా' అని ఆ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు 'పెద్ద కలలు కనటం నేర్చుకోండి' అని చంద్రబాబు హితవు పలికారు. తన హయాంలో సైబరాబాద్ నిర్మాణ సమయంలో కొన్ని ఉదాహరణలను చెప్పుకొచ్చారు. సరిగ్గా ఇదే తరహా అస్పష్టత విద్య, ఆరోగ్యంపై చర్చలో కూడా కనిపించింది. అదేవిధంగా, ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైన పౌర సేవల విభాగంతో 95523 00009 నెంబర్ ద్వారా సుమారు 751 సేవలకు ఏపీ ప్రభుత్వం 'మన మిత్ర' పేరుతో ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ ని సదరు జర్నలిస్టు ప్రస్తావించి ఉండాల్సింది. ఇందులో సకాలంలో అందించని సేవలకు జరిమానా ఏర్పాట్లతో రైట్ టూ సర్వీసెస్ చట్టం, స్థానిక ప్రభుత్వాల సాధికారత అమలు అవసరంగానీ.. వాట్సాప్ ద్వారా, నేరుగా ప్రజలు చేస్తున్న ఫిర్యాదులపై చర్యల విషయంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వేగంగా స్పందిస్తోంది. మంచి చేసినప్పుడు ప్రశంసించటం, ఇంకా మెరుగుపరచటానికి సూచనలివ్వటం కూడా అవసరం.

**యువత - విద్య**

'యంగ్ ఆంధ్రా, బోల్డ్ ఆంధ్రా' పేరుతో యువతకు సంబంధించి, వారి నైపుణ్యాలు, ఉపాధి, తాత్కాలిక తాయిలాలు, వారిని నాయకులుగా తీర్చిదిద్దటంలో కీలకమైన స్థానిక ప్రభుత్వాల సాధికారత, వారు ఎన్నికల్లో పోటీ చేసి తమ వినూత్న ఆలోచనలను దేశంలోని








సమస్యలను పరిష్కరించటానికి అవసరమైన పరిస్థితులు, కులం.. వీటన్నిటికీ కేంద్రబిందువైన నాణ్యమైన విద్య అత్యధికులకు అందకపోవటం గురించి ఎక్కువగా చర్చ జరిగింది. విదేశాల్లో చదువుకుని వచ్చి 'గీతం' కళాశాలల్ని నిర్వహిస్తున్న ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. నిస్సందేహంగా భరత్ చాలా అవగాహనతో మాట్లాడారు. కానీ ఆయన తన కార్యక్షేత్రాన్ని దాటి విద్యారంగంలోని లోపాలను ప్రస్తావించ లేకపోయారు. పాఠశాల విద్య మన దేశంలో, ఏపీలో ఎంత అధ్వాన్నంగా ఉందో జేపీ సోదాహరణంగా వివరించారు. ఏపీలో పదవ తరగతి స్థాయి పిల్లలు నిర్దిష్ట టైమింగ్స్ మధ్య రోజుకు ఎన్ని గంటలు నిద్రపోయారో కూడా 40% మంది చెప్పలేకపోతున్నారని, మార్కెట్ ఒక వస్తువుకు పది శాతం రిబేటు ఇస్తే ఎంత చెల్లించాలి, ఇంత డబ్బుకి అంత శాతం వడ్డీ అంటే ఎంతవుతుంది.. వంటివి 10% మంది కూడా చెప్పలేకపోతున్నారని తెలిపారు, జీవితంలో బతకటానికి కనీసం అవసరమయ్యే నైపుణ్యాల్ని కూడా స్కూలు విద్య 80–90 శాతం మంది పిల్లలకు నేర్పటం లేదని, ఈ డొల్ల పునాది ప్రభావం ఉన్నత విద్య మీద కూడా ప్రసరించి డిగ్రీ కాగితాలు తప్ప నైపుణ్యాలు ఉండటం లేదన్నారు. ఈ పరిస్థితిని ఎలా చక్కదిద్దాలి అని ప్రశ్నించారు. దీనికి భరత్ స్పందిస్తూ.. విద్యావ్యవస్థలో కీలకమైన పాఠశాల విద్యను బాగు చేయటం చాలా పెద్ద పని అని, దాని మీద తన శక్తిని కేటాయించలేనని నిజాయతీగా చెప్పారు. తనకు తెలిసిన ఉన్నత విద్య గురించి చెప్పారు. ఇంటర్ పూర్తయ్యాక ఉన్నత విద్యకు వస్తున్నవారు 30–40% ఉంటారని, వీరిలో ఎక్కువ మంది ఫీజుల్ని ప్రభుత్వమే చెల్లిస్తుండటం వల్ల ఇంజినీరింగ్ చేస్తున్నారని తెలిపారు. వీరిలో కేవలం 15% మందికి మాత్రమే నిజమైన నైపుణ్యాలు, మార్కెట్‌లో ఉపయోగపడే విద్య అబ్బుతోందన్నారు. స్కిల్స్ పెంచే ఐటీఐ, పాలిటెక్నిక్ పట్ల చిన్నచూపు ఉందన్నారు. ఇంజినీరింగ్ ఫీజు ఉచితం కావటం వల్ల ఆ విలువను చాలా తక్కువమంది మాత్రమే గ్రహించగలుగుతున్నారన్నారు. కనీసం రాష్ట్ర స్థాయి ప్రభుత్వ, ప్రయివేటు యూనివర్సిటీల్లో నిబంధనల్ని సడలిస్తే, ఐఐటీల వంటి వాటి నుంచి వచ్చిన విశ్రాంత అధ్యాపకుల్ని ప్రో వైస్ ఛాన్సలర్లుగా తీసుకునే అవకాశమిస్తే, చైనా తరహాలో మనం కూడా ప్రపంచస్థాయి ఉన్నత విద్యను అందించవచ్చన్నారు. ఈ నమూనా కోసం ప్రయత్నిస్తున్నామని, ఏపీలో విజయవంతమైతే మిగతా దేశంలో కూడా అమలు చేసే ఆలోచనను ప్రభుత్వం చేస్తుందని అభిప్రాయపడ్డారు. స్థానికంగా ఉపాధి లభించినా, రవాణా సదుపాయాల్ని కల్పించిన మరీ ఎక్కువ దూరం వెళ్లటానికి నిరుద్యోగులు, ముఖ్యంగా మహిళలు ఆసక్తి చూపటం లేదని శ్రీ భరత్ ఓ ఉదాహరణతో తెలిపారు. గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి అవసరాన్ని పరోక్షంగా తెలియచెప్పారు.

అదే విధంగా ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని అరికట్టటం, స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం సంస్కరణలపై ప్రశ్నను తన పరిధిలో లేని అంశాలుగా ఎంపీ దాటవేశారు. అయితే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న విశాఖ మహానగరం మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేయటానికి పలు వార్డుల్లో అర్హులైన అభ్యర్థులు కూడా దొరకటం లేదని నిర్మొహమాటంగా అంగీకరించారు. సరైన అభ్యర్థుల కోసం బహిరంగ ప్రకటన ఇవ్వాలనే ఆలోచన ఉందన్నారు (2009లో లోక్ సత్తా పార్టీ ఇలా అభ్యర్థులను ప్రజల నుంచి కూడా ఆహ్వానించింది). స్థానికంగా వార్డు/డివిజన్ స్థాయిలో డబ్బు ఖర్చు గురించి చెబుతూ, ఒక్కో కార్పొరేటర్ రూ.6 కోట్ల దాకా అభివృద్ధి పనులకు ఖర్చు చేయగలుగుతున్నాడని ఎంపీ చెప్పారు. కానీ ఎంపీ ల్యాడ్స్ 2012 నుంచి రూ.5 కోట్లే ఉండటంతో తాను అందులోనే ప్రజాప్రయోజన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోందన్నారు. అయితే డివిజన్‌లో ప్రజలు ఎన్నుకున్న వార్డు కమిటీలున్నాయా, వాటి ఆధ్వర్యంలోనే కార్పొరేటర్ నిధుల ఖర్చు చేస్తున్నారా, సొంతంగా చేస్తున్నారా, మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం తీరు మొదలైన అంశాలను లేవనెత్తె లేదు.



అదేవిధంగా, ఎంపీ శాసనవ్యవస్థలో తప్ప ప్రభుత్వంలో భాగం కాదు. కాబట్టి ఎంపీ ల్యాడ్స్ కాన్సెప్టే రాజ్యాంగ విరుద్ధం. జేపీ చాలాసార్లు ఈ అంశాన్ని ప్రస్తావించినా సమయాభావం వల్ల కావచ్చు, కాంక్లేవ్‌లో ఈ ప్రశ్నలు అడగలేదు.

ఇదేసమయంలో విశాఖలో కులం ప్రభావం తక్కువని, కాస్మోపాలిటన్ నగరం కావటం వల్ల అయ్యిండొచ్చని శ్రీభరత్ అంటూ.. ఒక ఆసక్తికర వ్యాఖ్య చేశారు. 'కులం ప్రభావాన్ని తీసేస్తే, అటువంటి ఇంకో ప్రతికూల ప్రభావాన్ని మనిషి తీసుకొస్తాడు' అని మానవ నైజాన్ని రాజకీయ కోణంలో వ్యాఖ్యానించారు. 'మేన్ ఈజ్ ఏ సోషల్ యానిమల్ అన్న అరిస్టాటిల్ మాటలస్థాయిని ఇప్పటికీ మనలో చాలామంది అధిగమించలేదని ఆయన నమ్ముతున్నట్లు అనిపిస్తుంది. దీనిపై జేపీ స్పందిస్తూ, విజయవాడలో ఒకప్పుడు ఎంత గొప్ప సామాజిక సంస్కర్తలు నడయాడారో గుర్తుచేశారు. సంస్కరణల్లో ముందుకెళ్లండి తప్ప మళ్లీ వెనక్కి వద్దని, కులతత్వంలో కూరుకుపోవద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ఈమొత్తం చర్చలో అసంతృప్తి కలిగించిన అంశం – అన్నిటికీ పునాదైన పాఠశాల విద్య గురించి చర్చ రాకపోవటం. రాష్ట్ర విద్యామంత్రి లోకేష్ కూడా చర్చలో పాల్గొని ఉంటే ఈ అంశం గురించి చర్చ జరిగి ఉండేది. వారి అబ్బాయి చదరంగంలో ఏదో రికార్డు సృష్టించిన నేపథ్యంలో సర్టిఫికెట్ తీసుకోవటం కోసం లండన్ వెళితే లోకేష్ కూడా హాజరైనట్లున్నారు. విద్యలో, పిల్లల బుద్ధి వికసించటంలో మౌలికమైన పాఠశాల విద్య గురించి సమగ్ర చర్చను ఇంకో కాంక్లేవ్ లో చూద్దాం.

**వైద్య, ఆరోగ్యం**

ఇక రెండో ప్యానల్ చర్చ 'వెల్ బీయింగ్' పేరుతో వైద్య ఆరోగ్యం మీద జరిగింది. ఈ చర్చలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, కిమ్స్ ఆస్పత్రుల వ్యవస్థాపకులు డాక్టర్ భాస్కరరావు పాల్గొన్నారు (సరిగ్గా ఈ సమయానికే ఏపీ, తెలంగాణల్లో ఆరోగ్యశ్రీ డబ్బులు చెల్లించటంలేదని కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు ఆ సేవల్ని బంద్ చేశాయి. తర్వాత ఏదో తాత్కాలిక సర్దుబాటు చేశారు).

జేపీ చర్చను ప్రారంభిస్తూ, ఈవేళ భారత్‌లో ఎవరు, ఏ సమయంలోనైనా ఆస్పత్రికి వెళ్లి నాణ్యమైన వైద్యం పొందే అవకాశం ఉందంటే, అది ప్రయివేటు రంగం పెరగటం వల్లేనని, అయితే దీనివల్ల సామాన్యులు నలిగిపోతున్నారని తెలిపారు. ప్రపంచంలో ఏ చెప్పుకోదగిన దేశంలో లేనిరీతిలో మన వద్ద రోగులు జేబులో నుంచి పెట్టే ఖర్చు మొత్తం వైద్య వ్యయంలో 50 శాతం దాకా ఉందన్నారు. ప్రపంచ సగటు కేవలం 18% అన్నారు. దీనివల్ల భారత్ లో ఏటా 5.5 కోట్ల మంది పేదరికంలోకి జారిపోతుండగా, వారిలో 26 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ నుంచి ఉన్నారన్నారు. **కోట్లాది సామాన్య ప్రజల మీద భారం లేకుండా, ప్రభుత్వ – ప్రయివేటు భాగస్వామ్యంతో భారత్‌లో వైద్యం అందించడం ఎలా సాధ్యం? ఏపీ ఒక నమూనాను అందించవచ్చా? అని జేపీ అడిగారు.**

దీనికి **డా.భాస్కరరావు స్పందిస్తూ,** ఇది చాలా ముఖ్యమైన అంశమని, ఒకప్పుడు ఫ్యామిలీ డాక్టర్లు ఉన్నప్పుడు ఈ సమస్య తీవ్రంగా ఉండేది కాదన్నారు. ఈవేళ సాంకేతికత పెరగటంతోపాటు.. ప్రజలు ఎక్కువగా గ్రామాల్లో ఉంటే, డాక్టర్లు నగరాల్లో ఉంటున్నారన్నారు. ఆధునిక వైద్యం అవసరమైతే పెద్ద సిటీలకు వెళ్లటం తప్ప మార్గం లేదన్నారు. ఈ నమూనా మార్చకపోతే వైద్యం ఉన్నకొద్దీ భారమవుతుందన్నారు. ప్రపంచంలో వైద్యానికి ఎక్కువ ఖర్చు చేస్తున్న దేశం అమెరికా అని, అక్కడ జీడీపీలో 18% దాకా ప్రభుత్వం, ప్రజలు ఖర్చు చేస్తారని, కానీ పంటి నొప్పికి చికిత్స కావాలంటే కొన్ని వారాలపాటు అపాయింట్ మెంట్ కోసం ఎదురుచూడాల్సి ఉంటుందన్నారు. సింగపూర్ మనం అనుసరించదగ్గ నమూనా అన్నారు. దీనికి జేపీ ఏకీభవిస్తూ, ఇన్సూరెన్స్ లేకపోతే అమెరికాలో చికిత్స తీసుకోవటానికి డాక్టర్లు కూడా భయపడతారని, అంత ఖరీదవుతుందని తెలిపారు. సింగపూర్‌లో ప్రజలు తమ ఆదాయంలో కొద్దిమొత్తాన్ని వైద్యానికి కేటాయిస్తారని, ఆ డబ్బు

సరిపోకపోతే, ఖరీదైన చికిత్స అవసరమైతే మాత్రమే ప్రభుత్వం చూసుకుంటుందని తెలిపారు. పూర్తి ఉచిత వైద్యం అందించటం వినటానికి బాగుంటుంది తప్ప.. ఆచరణలో సరైన ఫలితాలనివ్వదని బ్రిటన్ వంటి చోట రుజువైం దన్నారు. ఎలాగూ ఫ్రీ కాబట్టి, తాగుడు, మాదక ద్రవ్యాలు, సిగరెట్ల వంటి అలవాట్లతో ఒళ్లు గుల్ల చేసుకునే రకం కూడా ఉన్నారన్నారు. కాబట్టి పౌరులు కొద్దిపాటి కంట్రిబ్యూషన్ – ఆస్పత్రి చికిత్స ఖరీదైతే ఆ ఖర్చంతా ప్రభుత్వం భరించటం అనే సింగపూర్ నమూనా మేలన్నారు. అలాంటి నమూనాతో మొత్తం దేశానికి ఓ మోడల్ ని అందించే సంకల్పం ఏపీకి ఉందా అని సత్యకుమార్‌ని ప్రశ్నించారు.

నివారణ వైద్యానికి గ్రామీణ క్లినిక్‌లు, వ్యాధి ముదిరితే ఎన్.టి.ఆర్ ఆరోగ్య సేవ (ఆరోగ్యశ్రీ) ద్వారా చికిత్సలు అందిస్తామని, నియోజకవర్గానికో 100 పడకల ఆస్పత్రిని ప్రభుత్వ–ప్రయివేటు (పీపీపీ) పద్ధతిలో ఏర్పాటు, జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల మొదలైన అంశాలను మంత్రి చెప్పారు. అదేవిధంగా ఎన్.టి.ఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా అందరికీ ఇన్సూరెన్స్ ద్వారా చికిత్సలు అందిస్తామన్నారు. ఇందులో ఆదాయంతో ప్రమేయం లేకుండా ఏడాదికి రూ.2.5 లక్షలు, పేదలకి (1.43 లక్షల కుటుంబాలకు) రూ.25 లక్షల దాకా 3,257 వైద్య సేవలను అందిస్తామన్నారు (జబ్బుల్లో రకరకాల జ్వరాలు వగైరాలూ కలిపి చూపారని, వాటిని 319 రకాల వైద్య సేవలను 133 రకాలుగా వర్గీకరించవచ్చని తర్వాత ప్రకటించారు).

ఏపీ వైద్య ఆరోగ్య మంత్రిగారి వాదన సుస్పష్టం. యోగా, మంచి ఆహారం, విలేజ్ క్లినిక్ లో ఏఐ ద్వారా పట్టణంలోని డాక్టర్లు గ్రామీణుల్ని పరీక్షించే 'హైబ్రిడ్' విధానం ద్వారా నివారణ, ప్రాథమిక వైద్యం ఆ పైన ఇన్సూరెన్స్ ద్వారా ఆస్పత్రి చికిత్స.


ఇన్సూరెన్స్ వల్ల ఖర్చు పెరిగి అమెరికాలాంటి సంపన్న దేశంలో కూడా వైద్యం సరిగా అందటం లేదని, రాబోయే కాలంలో ఏపీ వ్యయం ఒక్క ఎన్.టి.ఆర్ ఆరోగ్య సేవకే రూ.30,000 కోట్ల దాకా చేరే అవకాశం ఉందని జేపీ చెప్పగా, మంత్రి గారు రూ.4–5,000 కోట్లు మించ దన్నారు. సింగపూర్ తక్కువ జనాభా కాబట్టి ఆ మోడల్ అమలు చేస్తోందని సత్యకుమార్ అభిప్రాయపడ్డారు. కానీ.. కిమ్స్ వంటి ప్రతిష్టాత్మక కార్పొరేట్ ఆస్పత్రిని నడుపుతూ రోజూ వైద్య సేవల్లో, కొత్త సాంకేతికతల్లో మునిగితేలుతున్న భాస్కరరావు సైతం ఎందుకు సింగపూర్ ని సూచించారు, అమెరికాలో ఇన్సూరెన్స్ జీడీపీలో 18 శాతం దాకా ఎందుకు చేరింది, ఆ దేశ జాతీయాదాయంలో సుమారు అయిదోవంతు శాతమంటే ఎంత డబ్బు? అన్న విషయాల్ని మంత్రిగారు ఆలోచించినట్లు కనిపించదు. సింగపూర్ అమెరికాతో సమానంగా ఆధునిక సాంకేతికతలతో వైద్యాన్ని చాలా తక్కువ మొత్తంతో అందిస్తూనే ప్రపంచ నెంబర్ వన్ గా ఎందుకుందో కొంచెం యోచించాల్సింది. అదేవిధంగా, 1970–80లలో జనాభాలో మన కంటే ఎక్కువగా ఉన్నచైనా అప్పటిదాకా అనుసరించిన మావో సేటుంగ్ విధానాల్ని మార్చుకుని డెంగ్ జియావోపెంగ్ సారథ్యంలో.. సింగపూర్ లీ క్వాన్ యూ నమూనాను అనుసరించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచంలో చాలా విషయాల్లో అమెరికాతో పోటీ పడుతోంది. ప్రజాస్వామ్యం సంస్కరణల్లో మినహాయించి విధానాల్లో, పౌర సేవల్లో, చట్టబద్ధపాలనలో సింగపూర్ నమూనాకు మనం వంకలు చెప్పనక్కర్లేదు. వారి అబ్బాయిని సింగపూర్‌లో ఎందుకు చదివిస్తున్నారో, మీ కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన వ్యవస్థాపకులు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని అడిగితే చెబుతారు. అదేవిధంగా,ఎన్.టి.ఆర్ వైద్య సేవను ద్వితీయ స్థాయిలో నర్సింగ్ హోంలకు పరిమితం చేసి, తృతీయ స్థాయి వైద్యాన్ని పూర్తిగా ప్రభుత్వంలోనే అందించాలన్న జేపీ సూచనకు మంత్రి సుముఖత వ్యక్తం చేయలేదు. ఓంకార పరివృత్తం విశ్వం, సంకల్ప పరిమితం దృశ్యం అంటారు గదా. మన సంకల్పాన్ని బట్టే లక్ష్యాన్ని చూస్తుంటాం. కానీ అమెరికా, చైనాలకు దీటుగా ఎదిగే అవకాశాల్ని సద్వి నియోగం గావించుకోవాలంటే, ఉత్పాదకతను పెంచు కోవాలంటే ఆ రాజకీయ సంకల్పం చాలదు.

ఆ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ, ఎన్.టి.ఆర్ ఆరోగ్య సేవను బంద్ చేస్తూ ప్యానల్ లో నమోదైన పలు ఆస్పత్రులు నిర్ణయం తీసుకోవటానికి కారణం పాత బకాయిలు చెల్లించకపోవటం. కానీ ఆ ఆస్పత్రుల్లో ప్రభుత్వం ఇచ్చే డబ్బుకు తోడు చాలామంది రోగులు జేబుల్లో నుంచి లక్ష, రెండు లక్షలు ఖర్చు చేయటం, ఆ తర్వాత మందులు సొంతంగా కొనుక్కోవటం చాలా సాధారణమైపోయాయి. ఈ విషయంలో కిమ్స్ భాస్కరరావు కూడా,చెల్లించే నగదు పెంచి సకాలంలో చెల్లించమన్నారేగానీ, ఇన్సూరెన్స్ ఆధారిత ఆ పథకాన్ని సర్వరోగ నివారిణి చేస్తే, ప్రాథమిక వైద్యం దెబ్బతినటంతోపాటు.. తృతీయ స్థాయి వైద్య ఖర్చులు భరించలేని స్థాయికి చేరుకుంటాయన్న అంశాన్ని హెచ్చరిం చలేదు. ప్రయివేటు, కార్పొరేటు ఆస్పత్రులను లాభాల కోసమే ఏర్పాటు చేసుకుంటారు కాబట్టి,ఆయనలా కోరుకోవటంలో తప్పులేదు. అయితే వేగంగా పెరుగుతున్న మెడికల్ టూరిజం నుంచి వారు ఆ లాభాల్ని ఆర్జించే అవకాశాలు చాలా ఉంటాయి. మన దేశంలో అధునాతన వైద్యం, శస్త్రచికిత్సలు మిగతా దేశాలతో పోలిస్తే చాలా

చౌకగా, ప్రపంచ స్థాయి నాణ్యతతో జరుగుతుంటాయి. కాబట్టి కార్పొరేట్ ఆస్పత్రుల లాభాల గురించి ఆందోళన అక్కర్లేదు. మన సమస్యల్లా 80–90 శాతం ప్రజలకు జేబు ఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యం అందటం. ఇక్కడ మంత్రిగారు లోతుగా, సమన్వయం చేసేలా ఆలోచించ లేదనిపిస్తుంది.

మొదటి ప్యానల్ చర్చలో ఉన్నత విద్య గురించి మాట్లాడుతూ ఎంపీ శ్రీ భరత్ చెప్పిన ఒక అంశాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. ఫీజు రీఇంబర్స్‌మెంట్ వల్ల, ఇంజినీరింగ్ విద్య నాణ్యత దెబ్బతిందని. ఇప్పుడు ఆరోగ్యశ్రీ వల్ల కూడా వైద్యం పక్కదోవ పడుతోంది. అవసరానికి మించి వైద్యులను నాణ్యతతో సంబంధం లేకుండా తయారుచేస్తున్నాం, ఆరోగ్యశ్రీ డబ్బుల మీద ఆధారపడి ఆస్పత్రులను స్థాపించేవారిని తయారుచేశాం. ఈ రెంటినీ అప్పట్లో లోక్ సత్తా పార్టీ 50 గ్యారంటీల పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టో నుంచి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకున్నారు. చివరికి వీటన్నిటి లక్ష్యమైన వైద్య సేవలు ప్రజలకు అందటం లేదు (ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి సహా వివిధ ఆరోగ్య పథకాల మీద, ఫీజు రీఇంబర్స్ మీద పునరాలోచన జరగాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ ఇటీవల సూచించారు. ఫీజు రీఇంబర్స్ మెంట్ హేతుబద్ధతను సమీక్షించాలన్న ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య సూచనను పరిగణలోకి తీసుకుంటున్నామని, దీనిపై కమిటీని నియమిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పాఠశాల విద్య, ప్రాథమిక, నివారణ వైద్యాల్ని విస్మరించి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఉన్నత విద్య, ఆస్పత్రి చికిత్సలో ప్రవేశపెట్టటం వల్ల ఖర్చు పెరగటం తప్ప ఫలితం ఉండదని అప్పట్లో జేపీ రెండు లేఖలను రోశయ్య ప్రభుత్వానికి రాశారు. పేదరికం కారణం గా ఎవరికీ ఉన్నత విద్య, ఆస్పత్రి వైద్యం అందని పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంటూనే.. ముందుగా పాఠశాల విద్య, ప్రాథమిక వైద్యం మీద దృష్టి సారించాలని కోరారు).

ప్రస్తుతం ప్రజారోగ్యంలో, స్థానిక ప్రభుత్వాల విధుల్లో భాగమైన తాగునీరు, పారిశుధ్యం వంటి వాటి ఖర్చును కూడా వైద్య బడ్జెట్ లో కలిపి చూపుతున్నాం. వైద్య రంగ నిపుణుల సలహాలు తీసుకోవాల్సిన రంగాల్లో టెక్నోక్రాట్లు, ఏఐ సలహాలు తీసుకుంటే, మనం చేసే పనులు కాళేశ్వరం ప్రాజెక్టులా తయారవుతాయి. ఆరోగ్యశ్రీ రూపకల్పన సమయంలో ప్రాథమిక, నివారణ ఆరోగ్యం ముఖ్యమని ఆ కమిటీ సభ్యునిగా తాను చెప్పినా వైఎస్సార్ వినిపించుకోలేదని డాక్టర్ భాస్కరరావు ఈ కాంక్లేవ్ లో పేర్కొనటం గమనార్హం.



**లాన్సెట్ రిపోర్టు హెచ్చరిక**

ఇక ఈ చర్చ జరుగుతున్న సమయంలోనే ప్రసిద్ధ వైద్య జర్నల్ 'ది లాన్సెట్' ఒక రిపోర్టు ప్రచురించింది. ప్రపంచంలో చాలా దేశాల్లో దీర్ఘకాలిక, జీవనశైలి వ్యాధులైన క్యాన్సర్, డయాబెటిస్, గుండెజబ్బు వంటివి పెరుగు తున్నాయని, కానీ వాటి వల్ల ఎక్కువ చనిపోతున్నవారు మాత్రం భారత్ లోనే ఎక్కువ ఉన్నారని తెలిపింది. 2010–2019 కాలంలో ఈ వ్యాధుల బారిన పడి మరణించినవారి సంఖ్య చైనా, ఈజిప్టు, నైజీరియా, రష్యా, బ్రెజిల్ వంటి దేశాల్లో తగ్గుతుంటే భారత్‌లో మాత్రం పెరుగుతోందని హెచ్చరించింది. ముఖ్యంగా మహిళలు సకాలంలో వ్యాధిని గుర్తించక, గుర్తించినా డాక్టర్ దగ్గరకి వెళ్లక అకాల మరణాలబారిన ఎక్కువగా పడుతున్నారని భారత్‌కు తెలియచేసింది. మనతో ఈ విషాదంలో పోటీపడుతున్న దేశం పపువా న్యూగినియా మాత్రమేనట. 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వంటి తాత్కాలిక కార్యక్రమాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు మహిళల ఆరోగ్యానికి భరోసానివ్వలేవు. కచ్చితంగా వారికి ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో నివారణ, ప్రాథమిక వైద్యం ఉంటేనే తమ సమస్యలను సవివరంగా చెప్పుకోగలరు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ సాధ్యమవుతుంది. యువ జనాభా ఉన్న దేశంలో జీవనశైలి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయంటే, ప్రాథమిక వైద్యం ఘోరంగా విఫలమైందని అర్థం. అంటు వ్యాధుల్ని చాలావరకూ కట్టడి చేశామని సంబర పడుతున్నాం. కానీ జీవనశైలి జబ్బులు పేరుకి అసాంక్రమిక వ్యాధులేగానీ, సాంక్రమిక (అంటువ్యాధుల్లా)

వ్యాపిస్తున్నాయి. లాభార్జనే ధ్యేయంగా పనిచేసే కార్పొరేట్ వైద్యులు కూడా ఈ మాట చెబుతున్నారంటే.. పరిస్థితి ఎలా నివురుగప్పిన నిప్పులా ఉందో ఆలోచించండి.

**హైబ్రిడ్ అమలు తీరు ఫలితాలనిచ్చేలా ఉండాలి**

విద్యలో, ఆరోగ్యంలో సాంకేతికతను వినియోగిస్తూ హైబ్రిడ్ పద్ధతిని అవలంబించటం అవసరమనటంలో సందేహం లేదు. కానీ ఏ సేవలకు, ఏ రీతిలో ఉపయోగించాలనేది కీలకం. ఆ పద్ధతుల్ని లాభాపేక్షలేని నిపుణులతో చర్చించి నిర్ణయించాలి. మీరు 'హైబ్రిడ్' నమూనాలో ప్రాథమిక వైద్యాన్ని డాక్టర్ లేని విలేజ్ క్లినిక్ లలో, 'సంజీవని' పేరుతో రోగుల ఇళ్లకెళ్లి ఏఐ ఆధారితంగా అందిస్తూ, ఆస్పత్రులను ప్రయివేటువారి పరం చేస్తూ, ఇన్సూరెన్స్ మోడల్ని అనుసరిస్తామంటున్నారు. టెక్నాలజీతో పెరుగుతున్న మానసిక సమస్యల్ని డాక్టర్ పరిశీలన, మెంటారింగ్ లేకుండా టెక్నాలజీతోనే సరిచేయగలరా? చివరికి సాధించేదేమిటి? తాత్కాలిక ఉపశమనం, అనారోగ్య ఆంధ్రప్రదేశ్.

**ఏఐ నిర్మాతలు శామ్ ఆల్ట్ మన్, సుందర్ పిచాయ్‌లకూ వ్యక్తిగత వైద్యులున్నారు..**

ఆ టెక్ దిగ్గజాలు ఏఐని డాక్టర్‌కి అసిస్టెంట్ గానే చూస్తారు ఎంత ఆర్థికాభివృద్ధిని సాధించినా, తలసరి రూ.13 లక్షలు ఆదాయం వచ్చినా.. అనారోగ్య వ్యయం పెరుగుతుంటే ఏం లాభం? ఏఐ సృష్టికర్తలైన శ్యామ్ ఆల్ట్ మన్, సుందర్ పిచాయ్ లాంటి వారందరికీ వ్యక్తిగత లేదా ఫ్యామిలీ వైద్యులున్నారు. సాంకేతికతను డాక్టర్‌కి సహాయకారిగా మాత్రమే ఉపయోగించాలన్న నిపుణుల సూచనల్ని వారు పాటిస్తున్నారు. అదేవిధంగా డేటా స్టోరేజీకి ఉపయోగ పడుతుంది. వైద్యులకి అవసరమైన అంచనాలను వేగంగా అందించటంలో ఏఐ సమర్థత ఇప్పటికే రుజువైంది. కానీ, జీవనశైలి వ్యాధులు వేగంగా అంటువ్యాధుల్లా పెరుగుతున్న నేపథ్యంలో, కేవలం ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నవారే మన దేశంలో 13.6 కోట్ల మంది ఉన్నారంటే.. ఆస్పత్రి చికిత్స ముఖ్యమా? నివారణ, క్రమం తప్పని డాక్టర్ పర్యవేక్షణతో ప్రాథమిక వైద్యం ముఖ్యమా? ఇది కాకుండా, గ్రామాలలో శిక్షణ లేని వైద్యులు పుట్టగొడుగుల్లా ఉన్నారు. వారిలో పనికొచ్చేవారి సేవల్ని వినియోగించుకోవాలి. ఆయుష్ వైద్యాన్ని మెరుగుపరచాలి. చాలా దూరదృష్టితో ఖజానా మీద భారం పడకుండా, అదే సమయంలో కనీస స్థాయి నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం సమగ్ర విధానం రూపొందించటం చాలా అవసరం. ఉన్నవారి ఆరోగ్యాన్ని, ఉత్పాదక శక్తిని పెంచలేనివారు ఇంకా జనాభాను పెంచాలని ప్రజలకు పిలుపునివ్వటం ఎంత విడ్డూరం.

చిన్న చిన్న లోపాలను సైతం నిర్లక్ష్యం చేయకూడదని నేపాల్

గ్రామాలలో శిక్షణ లేని వైద్యులు పుట్టగొడుగుల్లా ఉన్నారు. వారిలో పనికొచ్చేవారి సేవల్ని వినియోగించుకోవాలి. ఆయుష్ వైద్యాన్ని మెరు గుపరచాలి. చాలా దూరదృష్టితో ఖజానా మీద భారం పడకుండా, అదే సమయంలో కనీస స్థాయి నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం సమగ్ర విధానం రూపొందించటం చాలా అవసరం.

జెన్ జడ్ ఉద్యమం హెచ్చరిస్తోందని చంద్రబాబే ఈ సమావేశంలో అన్నారు. అలాంటిది వైద్య ఆరోగ్య విధానంలో ఇంత పెద్ద తప్పిదాన్ని వదిలేస్తే ఎంత నష్టమో వివరించనక్కర్లేదు. సింగపూర్ గురించి ఆయనకు ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అక్కడి ఆరోగ్య మంత్రితో, వైద్య నిపుణులతో, స్వదేశంలో, వివిధ దేశాల్లో ఉన్న భారతీయ వైద్య ప్రముఖులతో మాట్లాడి వైద్య ఆరోగ్య విధానంలో లోపాల్ని సరిదిద్దుతారని, దేశానికి ఒక ఒరవడిని చూపుతారని ఆశిద్దాం, వైద్యారోగ్యం రాష్ట్ర పరిధిలోని అంశమైనా దేశవ్యాప్తంగా ఒక టెంప్లేట్ యూనియన్ ప్రభుత్వం నుంచి వెలువడేలా ఆరోగ్య మంత్రి సత్యకుమార్ జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న తమ కూటమి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తారని ఆశిద్దాం. ఇందుకు పెద్ద అదనపు ఖర్చు కూడా అవదు. జాతీయ ఆరోగ్య మిషన్ రూపకర్త, యూనియన్ విద్యావిధానంలో మౌలిక మార్పులకు కారకులైన జేపీ చెప్పినట్లు..విద్యలో ఇప్పటికే అవసరానికి మించి ఖర్చు చేస్తుండగా, ఆరోగ్యానికి మరీ తక్కువ ఖర్చు చేస్తున్నాం. ఆరోగ్య బడ్జెట్ ను జాతీయాదాయంలో 1% దాకా పెంచి, విద్య, ఆరోగ్యంలో నిధులు ప్రతి రూపాయీ సద్వినియోగమయ్యేలా సరైన పద్ధతుల్లో ఖర్చు చేయటం కీలకం.

ఈ కాంక్లేవ్ నిర్వహించి, మంచి చర్చకు దోహదం చేసిన వే 2 న్యూస్ సంస్థకి అభినందనలు తెలియచేయాలి. వీటిలో జేపీ లేవనెత్తిన ప్రశ్నలపై, ఇచ్చిన సూచనలపై చాలా పరిమితంగా చర్చ జరిగింది. విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వ్యవసాయేతర రంగాలలో ఉపాధికి చిన్న పట్టణాల అభివృద్ధి తదితర మౌలిక అంశాలపై ముమ్ముందు మరిన్ని కాంక్లేవ్‌లు వారు నిర్వహిస్తారని, మిగిలిన మీడియావారు కూడా ఈ ఒరవడిని అనుసరిస్తూ ఇంకా వినూత్నంగా సదస్సులు నిర్వహించాలని కోరుకుందాం. ★

## సమాచార హక్కు చట్టం @ 20

# అమలులో లోపం.. నిర్వీర్యమవుతున్న చట్టం

**ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు..ప్రజలు కట్టే పన్నుల డబ్బులతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయి..అయినా ప్రజలకు దక్కాల్సిన గౌరవం ప్రభుత్వ కార్యాలయాల్లో దక్కడం లేదు..హక్కుగా పొందాల్సిన సేవలు, సమాచారం దక్కక ఆవేదనకు , అవమానానికి గురయ్యే పరిస్థితులు సాధారణమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమాచార హక్కు చట్టం దేశంలో మొట్టమొదటిసారి ప్రశ్నించే హక్కును సామాన్యుడు చేతికి ఆయుధంగా అందించింది. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగుల కర్తవ్యం అని ఎలుగెత్తి చాటింది. అధికారుల గుప్పెట్లో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందించాల్సిందేనని తేల్చి చెప్పింది. ప్రజలు, హక్కుల కార్యకర్తలు సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకుని అవినీతిని ఎండగట్టగలిగారు . అయితే అమలులో లోపాలు ఈ చట్టాన్ని సుపరిపాలన సాధనంగా మారకుండా అడ్డంకులు సృష్టించాయి..చట్ట నిర్మాతలు ఆశించిన ఫలితాలు దక్కకుండా నిర్వీర్యం చేస్తున్నాయి..**

-బండారు రామ్మోహనరావు

**2004లో** UPA కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 2005 లోనే వరసగా కొన్ని అభ్యుదయ కరమైన చట్టాలు రూపొందాయి. అందులో మొదట సమాచార హక్కు చట్టంతో పాటు గృహహింస వ్యతిరేక చట్టం, మహాత్మా గాంధీ ఉపాధి హామీ గ్యారెంటీ చట్టం వచ్చాయి. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 2025 అక్టోబర్ 12 నాటికి సరిగ్గా 20 సంవత్సరాలు పూర్తవుతుంది.ఆ చట్టం యొక్క ఉద్దేశం, పరిధి పరిమితులు ఎంతో ఉన్నతంగా ఉన్నా అమలులో 20 ఏళ్ల ప్రస్థానంలో ఏం జరిగింది? ఏం జరగాలి? అనే విషయాలను మనం చర్చించుకుందాం.

**సమాచార హక్కు చట్టం ప్రత్యేకత**

సమాచార హక్కు చట్టం దేశంలో మిగతా చట్టాల కంటే చాలా ప్రత్యేకమైన చట్టంగా చెప్పుకోవచ్చు ఈ చట్టం మిగతా చట్టాల కంటే విస్తృతమైనది, విలువైనది. స్వాతంత్రానంతరం ఇప్పటివరకు పార్లమెంట్ ద్వారా ఏ చట్టం చేసినా నిబంధనలు, విధివిధానాలు రూపొందించినప్పటినుండే అది అమలవుతుందనే ఒక క్లాజు తప్పనిసరిగా ఉండేది. ఏదైనా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి మెజార్టీ సభ్యులు ఆమోదిస్తే అది చట్టంగా మారడానికి దేశంలో రాష్ట్రపతి, రాష్ట్రాలలో గవర్నర్లు సంతకం చేయాలి. ఆ చట్టానికి సంబంధించి విధివిధానాలు తయారైన తర్వాత ఆ చట్టం వాస్తవంగా అమలులోకి వచ్చేది. ఇలా చాలా చట్టాలు రాష్ట్రపతి గవర్నర్ల సంతకం అయిన తర్వాత కూడా విధివిధానాలు రూపొందించకుండా శిశుమరణాల లాగానే పురుట్లోనే సంధి కొట్టి మరణించేవి. ఒక మాటలో చెప్పా లంటే ఆ చట్టాలు అమలు కాకపోయేవి. అలా 2002లో సమాచార స్వేచ్ఛ హక్కు చట్టం కూడా వచ్చింది. దాని విధివిధానాలు ఖరారు కాకపోవడం వల్ల అది అక్కరకు రాని చుట్టంగా మారిపోయింది. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని 2005 జూన్ 15న భారత పార్లమెంటులో సమా చార హక్కు చట్టం బిల్లు పాసై చట్టంగా మారింది.ఆ చట్టంలోనే రాష్ట్రపతి సంతకం అయిన రోజు నుండి 120 రోజుల తర్వాత వెంటనే చట్టం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ ఒక్క చట్టంలో మాత్రమే ఇలాంటి ఏర్పాటు చేశారు. ఆ చట్టంలో ఉన్న విధంగానే సరిగ్గా జూన్ 15 2025 రోజు నుండి అక్టోబర్ 12 2025 వరకు 120 రోజులు నిండి ఆ రోజు నుండి దేశవ్యాప్తంగా ఈ చట్టం అమల్లోకి వచ్చింది. సమాచార హక్కు చట్టానికి ఉన్న ప్రాధా న్యత అది.

**సమాచార హక్కు చట్టం అక్కరకు రాని చుట్టంగా ఎందుకు మారింది?**

ఆ తర్వాత ఏం జరిగిందంటే ఈ చట్టం ప్రకారం దేశంలో జాతీయ సమాచార హక్కు చట్టం కమిషన్ ఏర్పడింది. అదేవిధంగా రాష్ట్రాలలో ప్రతి రాష్ట్రానికి ఒక సమాచార హక్కు చట్టం కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ సమాచార హక్కు చట్టంలో మొత్తం ఆరు అధ్యాయాలు 31 సెక్షన్లు

ఉన్నాయి. ఏ చట్టమైన ప్రజలకు అవగాహన లేకపోతే ఆ చట్టం నిరుపయోగంగా మారిపోతుంది. కనుక సమాచార హక్కు వివిధ వర్గాలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం అప్పట్లో మంచి ప్రయత్నం చేసింది. చట్టం పట్ల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు, ప్రభుత్వ అధికారులకు, పౌర సమాజానికి వేరు వేరుగా అవగాహన కల్పించడానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఒక మంచి ప్రయత్నం జరిగింది. హైదరాబాదులోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వారితో కలసి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పౌర సమాజానికి శిక్షణ ఇవ్వడానికి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ప్రకారం పౌర సమాజానికి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 200కు పైగా నియోజకవర్గాలలో ఒక సంవత్సరానికి పైగా సమాచార హక్కు చట్టం గురించి అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత మీడియా మిత్రులకు అవగాహన కల్పించడానికి ప్రెస్ అకాడమీతో పాటు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ కూడా ఒక ఒప్పందం కుదుర్చుకుని వారు మీడియా మిత్రులకు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించారు. నేను కూడా ఒక సీనియర్ జర్నలిస్టుగా జర్నలిస్టు మిత్రులకు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించే రిసోర్స్ పర్సన్‌గా పనిచేశాను. ప్రభుత్వ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు(PIO) అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లకు(APIO)శిక్షణ ఇచ్చింది. మాజీ IAS,మాజీ ఆర్డీవోలు వాళ్లందరి ద్వారా ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇచ్చారు. విషాదం ఏమిటంటే నిజంగా నిద్ర పోయేవాడిని లేపవచ్చు నిద్ర నటించే వారిని లేపడానికి ప్రయత్నం చేసినా సాధ్యం కాదు కనుక ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన శిక్షణ తూతూ మంత్రంగా ముగిసింది. కొంతమంది బాధ్యత కలిగిన కమిట్మెంట్ ఉన్న అధికారులు ఈ శిక్షణ బాగా ఇచ్చినా కూడా ఆ శిక్షణను స్వీకరించే కొందరు అధికారుల్లో నిర్లిప్తత, ఎక్కువ మందిలో ఈ సమాచార హక్కు చట్టం పట్ల వ్యతిరేకత ఉండడం వల్ల సమాచార హక్కు ప్రజలకు అందకూడదు. అందితే తమకే నష్టం అని భావించిన అధికారులు ఈ శిక్షణను సీరియస్‌గా తీసుకోలేదు. తీసుకున్నా చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని ప్రజలకు సమాచారం ఇవ్వకుండా ఎలా తప్పించుకోవచ్చో ఆ చట్టంలోని క్లాజులను బాగా ఆకళింపు చేసుకున్నారు. అందుకే ఇప్పుడు మీరు ఏదైనా సమాచారం కోరితే ముక్తసరిగా ఇది సమాచార హక్కు పరిధిలోకి రాదని, మా వద్ద మీరడిగిన సమాచారం లేదని సమాధానం ఇచ్చి ఊరుకుంటున్నారు. అందుకే అధికారుల సహకారం లేనిదే ఈ సమాచార హక్కు చట్టం అమలు సాధ్యం కాదని తేలిపోయింది.




## నిర్వీర్యమైన సమాచార హక్కు కమిషన్లు

ఇక సమాచార హక్కు చట్టం కమిషన్ల నియామకంలో కూడా మొదట కొంచెం చిత్తశుద్ధితో పనిచేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమాచార హక్కు చట్టం వల్ల తమ అవినీతి పనులు బయటపడుతున్నాయని తమ చాప కిందికి నీళ్లు వస్తున్నాయని తెలుసుకొని ఉద్దేశపూర్వకంగానే మెల్ల మెల్లగా సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించే విషయంలో నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టాయి. చాలా రాష్ట్రాలలో సమాచార హక్కు కమిషన్లు ఉనికిలో లేకుండా పోయాయి. ఆఫీసు స్టాఫ్ ఉంటారు కానీ సమాచార హక్కు ప్రధాన, ఇతర కమిషనర్ల నియామకం లేకపోవడం వల్ల ఏళ్ల తరబడి సమాచార హక్కు కమీషన్లు పనిచేయడం లేదు. ఒకవేళ సమాచార హక్కు కమిషనర్లను నియమించినా కూడా వారు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, నాయకులకు అడుగులకు మడుగులొత్తే వారిని మాత్రమే కమిషనర్లుగా నియమిస్తున్నారు. పౌర సమాజంలో సమాచార హక్కు చట్టం గురించి పోరాడిన అనేక మంది ఉద్యమకారులను కాదని తమ పార్టీ సానుభూతిపరులను, అనధికారులను కూడా సమాచార హక్కు కమిషనర్లుగా నియమించుకుంటున్నారు. దాని ద్వారా సమాచార కమిషన్ కమిషన్లు చాలా పెద్ద తప్పులు చేసిన అధికారులను కూడా కేవలం మందలించి ఊరుకుంటున్నారే తప్ప ఎవరికైతే న్యాయం చేయాలో వారికి సరైన న్యాయం చేయడం లేదు. కిందిస్థాయి అధికారులు సమాచారం ఇవ్వని సందర్భంగా పై సమాచార హక్కు కమిషనర్లను ఆశ్రయిస్తే ఫిర్యాదుదారులను అప్పీలు దారులనేమో విచారణ సందర్భంగా దోషిగా నిలబెట్టిన విధంగా నిలుచుండబెట్టే మాట్లాడిస్తున్నారు. అదే సమాచారం ఇవ్వకుండా అలసత్వం చేసి తప్పిదాలకు పాల్పడ్డ అధికారులను కూర్చుండబెట్టి విచారణ జరుపుతున్నారు. సమాచార హక్కు కోసం తపించే ఫిర్యాదుదారులకు

కమిషన్లు ఇచ్చే మర్యాద ఈ విధంగా ఉంది. అలాగే సమాచార హక్కు కమిషన్లకు విచారణ నిమిత్తం వచ్చిన అధికారులు తాము ఆ కమిషన్ల ముందు హాజరైనందుకు టీఏ,డీఏలు కూడా క్లైమ్ చేసుకుంటున్నారు. కానీ ఫిర్యాదు దారు తన సొంత ఖర్చుతో ఈ కమిషన్ల ముందు హాజరు కావలసివస్తుంది. సమాచారం ఇవ్వని అధికారులు నేరస్తులుగా ఉండి కూడా వారు అధికార దర్పంతో విచారణ ఎదుర్కొంటే సమాచారం పొందని దరఖాస్తుదారులు బేలగా కమిషన్ ముందు నిలబడే పరిస్థితి తయారైంది.

**మీడియా సహకారం**

ఇక ప్రెస్ అకాడమీ ద్వారా జరిగిన శిక్షణ చాలావరకు ఫలించింది. కిందిస్థాయి గ్రామీణ విలేకరులు, రిపోర్టర్లు ఈ సమాచారాన్ని ఉపయోగించుకొని అనేకమైన పరిశోధనాత్మక వార్తలు రాశారు. ఎన్నో అవినీతి కుంభకోణాలను బయటపెట్టారు. దానికి అవసరమైన ఆధారాలను సమాచార హక్కు ద్వారా సేకరించారు. దాంతోపాటు పలు తెలుగు దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు సమాచార హక్కు చట్టం అవగాహన, సమాచార వ్యాప్తికి చాలా దోహదపడ్డాయి. ఈనాడు దినపత్రిక 'ముందడుగు' శీర్షికతో సమాచార హక్కు గురించి అనేక విషయాలను వెల్లడిస్తూ వ్యాసాలు ప్రచురించింది. ఇక లోక్‌సత్తా ఇచ్చిన శిక్షణ వల్ల పౌర సమాజం చాలా పెద్ద ఎత్తున మేల్కొని సమాచార హక్కు సంఘాలు ఏర్పడ్డాయి. ఇప్పటికి కూడా పౌర సమాజం ఈ సమాచార హక్కును ఉపయోగించుకోవడానికి ఎంతో ఉత్సాహం చూపుతుంది. కానీ అధికారుల సహాయ నిరాకరణ పెద్ద అవరోధంగా మారింది. అలాగే సమాచార హక్కు అమలు చేసే అధికారులు కమిషన్లు ప్రవర్తిస్తున్న తీరువల్ల సమాచార హక్కు చట్టం రెండు దశాబ్దాల తర్వాత తుప్పు పట్టిన చట్టంగా మిగిలిపోయింది. మనం ఇంట్లోకి ఒక కొత్త కత్తిని తీసుకువచ్చి దాని కవర్ కూడా తీయకుండా బీరువాలో దాస్తే కొన్నాళ్లకు అది తుప్పు పట్టకుండా ఉంటుందా అలాగే సమాచార హక్కు అనే పాశుపతాస్త్రాన్ని వాడకపోవడం వల్ల తుప్పు పట్టి నిర్వీర్యమైపోతోంది.

**తిలా పాపం తలా పిడికెడు**

ఇక సమాచార హక్కు కార్యకర్తల పేరుతో కొందరు అధికారులను బెదిరించడానికి, బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అటువంటి వారి మీద అధికారులు ఫిర్యాదు చేయవచ్చు. కానీ తమ అవినీతి ఎక్కడ బయటపడుతుందో అనే భయంతో ఇలాంటి సమాచార హక్కు కార్యకర్తల పేరు మీద ఆగడాలు చేసే వారి పని పట్టడానికి వారు వెనుకా ముందు ఆడుతున్నారు. కొన్ని చోట్ల దొంగ చీకటి ఒకటైనట్లు సమాచారం అడిగే వాడిని ప్రసన్నం చేసుకొని నేను నీకు సమాచారం ఇవ్వను నీకు కావలసిన పని చేసి పెడతాను అని అధికారులు రాజీ కుదురుచుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అలాగే తమ అవినీతి కార్యకలాపాలు వెలికి తీయకుండా ఉంటే సమాచార హక్కు చట్టాన్ని వాడుకోకుండా ఉంటే నెలకు నీకు ఇంత డబ్బు ఇస్తానని కూడా కొందరు సామాజిక కార్యకర్తలతో అధికారులు కుమ్మక్కైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇవి నాణానికి మరొక వైపు విషాదకర కోణం. నిజాయితీగా సమాచార హక్కు గురించి పాటు పాటుపడే వారికి ఇటువంటి నకిలీ సామాజిక సమాచార కార్యకర్తలు నష్టం కలిగిస్తున్నారు. గుర్రాన్ని గాడిదను అందరిని ఒకే గాట కట్టవలసి వస్తుంది. ఇలాంటి పరిస్థితి పోవాలంటే సమాచారం ఎవరికి అవసరమైతే వారి నుండే దరఖాస్తు చేయిస్తే ఇలాంటి అపవాదు రాకుండా ఉంటుంది. మనం అనారోగ్యానికి గురైతే డాక్టర్ దగ్గరికి వెళ్తాం.. డాక్టరు అవసరమైన మందులు రాసిస్తారు. అంతేకానీ ఆ మందులను డాక్టర్ మింగరు.. మింగితే ఆ డాక్టర్ అనారోగ్యం బారిన పడతారు..అలాగే, ఎవరికైతే సమాచారం అవసరం ఉందో మన సమాచార హక్కు కార్యకర్తలు వారిని ఎడ్యుకేట్ చేసి వారి ద్వారానే దరఖాస్తు పెట్టించాలి. సమాచార హక్కు కార్యకర్తలు పైరవీ కారులుగా కాకుండా ఒక సామాజిక డాక్టర్‌గా పని చేయాలి. వారి అనారోగ్యానికి నేనే మందు మింగుతాను అంటే నేను చెప్పిన ఉదాహరణ సరిగ్గా సరిపోతుంది. సమాచార హక్కు కార్యకర్తలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

**సమాచార హక్కు చట్టం**
**బాగా అమలు కావాలంటే ఏం చేయాలి?.**

సమాచార హక్కు నిర్వీర్యం కావడానికి మొదట ప్రభుత్వం తర్వాత అధికారులు. కమీషనర్ల పనితీరు చివరికి ప్రజలలో సమాచార హక్కు పేరు మీద బ్లాక్ మెయిల్ చేసే కార్యకర్తల వల్ల సమాచార హక్కు చట్టం ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలిపోతుంది. ఇది మారాలంటే ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వచ్ఛందంగా వెల్లడించే క్లాజు 4.1B ప్రకారం 17 అంశాలతో కూడుకున్న సమాచారాన్ని ఆయా ఆఫీసులలో మొదట వెల్లడించాలి. అప్పుడు సమాచారం అడిగే అవసరం చాలావరకు ప్రజలకు తప్పుతుంది. తప్పు చేసిన పిఐఒ ఏపీఐవోల పట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించకూడదు. సమాచార హక్కు చట్టం ప్రకారం ఏర్పాటైన కమిషన్ కమిషనర్లు తమ బాధ్యతను ఎరిగి సమాచారం అడిగిన ఫిర్యాదుదారులకు సమాచారం ఇప్పించే ప్రయత్నం చేయాలి. నొప్పించే పని చేయకూడదు. ఏదేమైనా ఏదైనా చట్టం అమలు కావాలంటే ప్రజలకు ఆయా చట్టాల పట్ల సమగ్ర అవగాహన కల్పించడమే సరైన పరిష్కారం. ❖

# తెలంగాణ విద్యావిధానం రూపకల్పనకు కమిటీ .. అక్టోబర్ 30 నాటికి నివేదిక

తెలంగాణ విద్యావిధానాన్ని (టీఈపీ) రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు చైర్మన్‌గా, మరో అయిదుగురు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరో సభ్యుడిని అదనంగా చేర్చుకునే వెసులు బాటునిచ్చింది.

విద్యారంగంలో సంస్కరణలే ప్రధాన లక్ష్యంగా కమిటీ అధ్యయనం చేసి అక్టోబర్ 30 లోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. 2024 జులైలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో సంస్కరణలకు మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్ గా, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. ఉప సంఘం సైతం జాతీయ విద్యావిధానం -2020లో ఏ అంశాలను అమలు చేయవచ్చో వివరిస్తూ నివేదిక ఇవ్వాలని గతేడాది అధికారులను ఆదేశించింది. అయినా ఇప్పటి వరకూ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా మరో కమిటీని నియమించింది.

**కమిటీ..**

**చైర్మన్:** కె. కేశవరావు, సభ్యులు: కె. రామకృష్ణారావు, ఆచార్య బాలక్రిష్ణారెడ్డి, యోగితా రాణా, కడియం శ్రీహరి, ఆకునూరి మురళి.

**కమిటీ పరిశీలించే అంశాలు..**

⏭ తెలంగాణ రైజింగ్ 2047ను దృష్టిలో ఉంచుకుని, జాతీయ విద్యావిధానం - 2020లోని అంశాలను అధ్యయనం చేసి రాష్ట్రానికి అనుగుణంగా మార్పు చేయటం

⏭ డిజిటల్ పరివర్తన, ఆవిష్కరణ, ఎంట్రప్రెన్యూర్ షిప్ తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగ మార్కెట్, నైపుణ్యాలు, ప్రపంచవ్యాప్త అవకాశాలను పరిశీలించటం

⏭ పరిశోధన, విద్యాసంస్థలు-పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలను సిఫారసు చేయటం

⏭ పాఠశాల, ఉన్నత, సాంకేతిక, ప్రొఫెషనల్ విద్యలో నాణ్యతను పెంచటం

**విద్యకు ఓ అధ్యాయం**

క్షేత్రస్థాయి పరిస్థితులు, భవిష్యత్తు అవసరాలకి తగినట్లుగా రూపొందించనున్న తెలంగాణ విద్యావిధానం (టెప్) దేశానికి దిక్సూచిగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులు, విద్యావేత్తలకు సూచించారు. హైదరాబాద్ రాష్ట్రం భారత్ లో విలీనమై తెలంగాణలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యావిధానంలో భాష ఉన్నవారి వద్ద జ్ఞానం లేదని, జ్ఞానమున్న చోట భాష లేదని, ఈ రెండూ ఉన్నవారి వద్ద నైపుణ్యాలు లేవని.. ఈ మూడింటి మేళవింపుగా విద్యను అందించే విధానం రాష్ట్రానికి కావాలని అన్నారు. తెలంగాణ విద్యారంగం తీరు పట్ల ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయి నుంచి వర్సిటీ వరకూ సమూల ప్రక్షాళన చేయాలన్నారు.

⏭ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు గతంలో భూములు, నిధులను పంచేవని, ఇప్పుడు పంపకానికి తగినన్ని భూములు, నిధులు లేవని, విద్యతోనే సంపదసృష్టి సాధ్యమని రేవంత్ అన్నారు.

⏭ సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చాక దేశ, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా అందుబాటులోకి వచ్చాయి. విద్యాప్రమాణాలు మాత్రం ఆస్థాయిలో పెరగలేదు. ఫలితంగా అవకాశాలను అంది పుచ్చుకోవటంలో విఫలమయ్యాం.

⏭ ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలపై సబ్ కమిటీలుగా ఏర్పడి ఉత్తమ డాక్యుమెంట్ ని రూపొందించాలి. సిలబస్, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం. విద్యావ్యవస్థకు 2047 వరకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యావిధానం ఉండాలి.

⏭ డిసెంబర్ 9న ఆవిష్కరించనున్న తెలంగాణ దార్శనిక పత్రం 2047లో దీనికి ఒక అధ్యాయం కేటాయిస్తాం.

⏭ విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మౌలిక వసతుల మెరుగుకు నిధులను కేటాయించాలని నిర్ణయించాం. విద్యాభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్.ఆర్.బి.ఎం పరిమితి నుంచి తొలగించాలని యూనియన్ ప్రభుత్వాన్ని కోరాం అని ముఖ్యమంత్రి తెలిపారు. ❖

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

Jugaad Bharat United Voters

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

# Good governance Vote Jugaad October 2025

## Jugaad Bharat United Voters

## Simplifying Democracy - Strengthening Unity

## మన ఓటు హక్కుని మనమే కాపాడుకోవాలి

1) భావజాలం ఎంత మంచిదైనా- అధినాయకుడు ఎంత మంచి వాడైనా - అంతర్గత ప్రజాస్వామ్యం లోపించిన పొలిటికల్ పార్టీలు చిత్తశుద్ధిలేని కార్యకర్తలతో ఊరికి ఒకటి చొప్పున పుట్టుకొస్తున్నా దేశానికొరిగే లాభం ఏమీలేదని గ్రహించిన భారత జాతీయ ఎన్నికల కమిషన్ ఈ మధ్యనే అటువంటి కొన్ని వందల పొలిటికల్ పార్టీలను రద్దు చేయడం ఓటర్లందరూ అభినందించదగిన శుభ పరిణామంగా భావించాలి.

2) మొదటిసారి ఫోటో గుర్తింపుకార్డుద్వారా ధ్రువీకరించబడిన ఓటర్లిస్టుని మాటిమాటికి సవరించవలసిన అవసరం లేదు. కనీసం 10 సంవత్సరాలు అమల్లో ఉండే విధంగా లిస్టులు తయారు చేసుకోవాలి. ఎన్నికల ముందు ఓటరు అనుమతిలేనిదే ఓటర్ల జాబితాలను సవరించకూడదు. ఎన్నికలయిన తర్వాత మూడు నెలల లోపుగా. అధికారిక ఓటర్ల జాబితాలను ప్రకటించాలి. అదే సమయంలో ఓటు వేయని వారి లిస్టును కూడా ప్రకటించాలి. “ఓట్ల చోరీ” జరుగుతోందనే అభియోగాన్ని నిరోధించడానికి ఇదే సక్రమ మార్గమని జుగాడ్ ఓటరుగా నా ప్రతిపాదన!

3) Jugaad పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవాలంటే జీవితంలో ఒకేసారి తన కష్టార్జితమైన రూ.10,000/ విరాళమివ్వగలిగి ఉండాలి. అంత స్తోమతులేనివారు జుగాడ్ ఓటరుగా ఒకేసారి రూ.5,000 కానీ రూ.2,000 కానీ ఇచ్చి మీవంతు బాధ్యత మీరు స్వీకరించండి. నిరుద్యోగ సమస్యలేని ప్రణాళిక సిద్ధంగా ఉంది..

4) మనదేశంలోని రెండు పార్టీలకు (Congress & BJP) ప్రత్యామ్నాయంగా సుపరిపాలన కోసం ప్రతిపాదిత జుగాడ్ ద్విపక్ష పార్టీ రాబోతున్నది. అందుకోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి, 25 మంది భారత భాగ్య విధాతలుగా నమోదు కావాలి. అధికారపక్షం, విపక్షం రెండూ మన పార్టీలో ఉంటాయి. అదే ప్రతిపాదిత నమూనా మార్పు. మన ఓటుహక్కుకి అత్యంత రహస్యంగా, సంపూర్ణంగా రక్షణ ఉంటుంది.

జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు : (Rs/-10,000 donors)

**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH**

జుగాడ్ ఓటర్లు : **Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh Eeraveni (36)Somanchi Radhakrishna**

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

advt

# విద్య కోసం ప్రభుత్వానికి పన్నులు.. మళ్లీ, ప్రయివేటు స్కూళ్లకి 10 రెట్లు ఎక్కువ ఫీజులు

- ***పట్టణ ప్రాంతాల్లో ఎక్కువమంది విద్యార్థులు ప్రయివేటుకే***
- ***తల్లిదండ్రులకు తప్పని జేబు ఖర్చు, అప్పులు***
- ***ఎన్.ఎస్.ఎస్ సీఎంఎస్ పాఠశాల విద్య సర్వే 2025లో వెల్లడి***

విద్యకి కీలకం విద్యాప్రమాణాలు అందులోనూ పాఠశాల విద్యాప్రమాణాలు అత్యంత కీలకం అని దశాబ్దాల ఆలస్యంగానైనా ప్రభుత్వాలు జాతీయ, రాష్ట్రాల స్థాయిల్లో వివిధ సర్వేలను నిర్వహిస్తున్నాయి. ఇప్పటి వరకూ ఉన్న విద్యార్థుల నమోదు స్థానంలో ఇప్పుడు పిల్లలు ఏం నేర్చుకున్నారు అని కాస్త చర్చ జరుగుతోంది. ఈ కోణంలోనే ఖర్చుకి సంబంధించిన సర్వేలు కూడా వెలువడుతున్నాయి. పాఠశాల విద్య (1-12)కు ఇంకా ఎక్కువ ఖర్చు చేయాలని కొందరు డిమాండ్ చేస్తుండగా.. చేస్తే మంచిదేగానీ, ఇప్పటికి చేస్తున్న ఖర్చు మనలాంటి దేశంలో చాలా ఎక్కువ అని నిపుణులు చెబుతున్నారు.

జాతీయ నమూనా సర్వే (ఎన్.ఎస్.ఎస్) 80వ రౌండ్ లో భాగంగాపాఠశాల విద్యారంగానికి సంబంధించి యూనియన్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సీఎంఎస్ (సమగ్ర మాడ్యులర్ సర్వే)తల్లిదండ్రుల జేబు ఖర్చుల కోణంలో వివరాల్ని వెల్లడించింది. ఈ సర్వేను 2025 ఏప్రిల్-జూన్ కాలంలో నిర్వహించారు.

ప్రస్తుతం పాఠశాలల్లో నమోదైన పిల్లల చదువు కోసం ఒక్కో ఇంట్లో ఎంత ఖర్చు చేస్తున్నారో ప్రధానంగా ఇందులో సేకరించారు. సుమారు 52,085 కుటుంబాలు, 57,742 మంది విద్యార్థులను దేశవ్యాప్తంగా సర్వే చేశారు. కంప్యూటర్ సహకార వ్యక్తిగత ఇంటర్వ్యూల (సీఏపీఐ) రూపంలో ఈ సర్వే నిర్వహించారు.

**ఎందుకు ఈ సర్వే ప్రాధాన్యత కలిగినది?**

స్కూల్స్ సమగ్ర మాడ్యులర్ సర్వే 2025 ప్రభుత్వ పాఠశాలల్లో ఖర్చును అతి తక్కువగా చూపింది. ఈ స్కూళ్లలో చదివే అత్యధికులకు కోర్సు ఫీజు లేదు గానీ, అదనపు పుస్తకాలు, స్టేషనరీ, ట్యూషన్ల వంటి భారం ఉంది. ప్రభుత్వ స్కూళ్లతో పోలిస్తే, ప్రయివేటు స్కూళ్లలో తల్లిదండ్రులు చెల్లిస్తున్న ఆర్థిక మూల్యం 10 రెట్లు ఎక్కువని



పేర్కొంది. పైకి లెక్కలు పక్కగా ఉన్నట్లు కనిపిస్తాయి. కానీ ప్రభుత్వ స్కూళ్లు ఉచితంగా నడుస్తున్నాయా? టీచర్లకు జీతాలు లేవా? కొన్ని ఐఐటీల్లోని ప్రొఫెసర్ల కంటే మన ప్రభుత్వ పాఠశాల టీచర్లకు జీతాలు ఎక్కువ ఉన్నాయంటే.. ఆ డబ్బు ఎక్కడ్నుంచి వస్తోంది? ఏ ముఖ్యమంత్రి జేబులో నుంచి పెడుతున్నారు? కాబట్టి ఇందులోని అంకెలు వాస్తవం, అంకెల వెనుక పరమార్థం మాత్రం భిన్నమైన చిత్రాన్ని చూపుతుంది.ప్రభుత్వానికి మనం పన్నుల ద్వారా కట్టే డబ్బుతో తెలుగు రాష్ట్రాల్లో ఒక్కో పాఠశాల విద్యార్థి మీద ఏడాదికి రూ.1 లక్షకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఇందులో పేర్కొన్న ప్రయివేటు స్కూళ్ల ఫీజుల వ్యయం అందులో సగం దాకా ఉంటుందేమో. ఆ ప్రస్తావన లేకుండా ఖర్చులను పేర్కొనటంతో ప్రయివేటు స్కూళ్ల ఫీజులు మాత్రమే ఎక్కువ భారమన్నట్లు కనిపిస్తాయి ఈ సర్వేలో. అమెరికా, బ్రిటన్ లలో పన్నులు కడితే చాలు ప్రపంచ స్థాయి చదువు ఉచితంగా అందుతుంది. 95% మంది ప్రభుత్వ బడులకే వెళతారు. అక్కడ స్కూళ్లను బట్టి ఇళ్లకు గిరాకీ ఉంటుంది. జర్మనీలోనూ అంతే. సుమారు 90% మంది ప్రభుత్వ స్కూళ్లకే ఉచితంగా, అంటే ట్యాక్స్ కట్టిన హక్కుతో వెళతారు.

**సగటు ఫీజులు (రూ.లలో)**

| | గ్రామీణ | పట్టణ | గ్రామీణ + పట్టణ |
|---|---|---|---|
| ప్రభుత్వ పాఠశాలల్లో | 2,639 | 4,128 | 2,863 |
| ప్రయివేటు ఎయిడెడ్ | 11,209 | 20,748 | 15,364 |
| ప్రయివేటు అన్ ఎయిడెడ్ | 22,869 | 35,758 | 28,693 |
| ఇతర పాఠశాలలు | 10,918 | 21,102 | 14,315 |

**ఫీజుల్లో దేనికెంత వాటా (రూ.లలో)**

| | గ్రామీణ | పట్టణ | గ్రామీణ + పట్టణ |
|---|---|---|---|
| కోర్సు ఫీజు | 3,979 | 15,143 | 7,111 |
| రవాణా | 1,359 | 3,082 | 1,842 |
| యూనిఫాం | 887 | 1,540 | 1,070 |
| పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ | 1,664 | 2,867 | 2,002 |
| ఇతరత్రా | 494 | 838 | 590 |


మన దేశంలో ట్యాక్స్ కట్టినా ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లేవారి సంఖ్య తగ్గిపోతోంది. ట్యాక్స్ తోపాటు అదనంగా ఫీజు కట్టి ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. అక్కడా కొద్దిమేర మినహా గొప్ప చదువేమీ రావటం లేదు. పట్టణాల్లో అత్యధికులు ఇప్పటికే ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. అంటే, వేగంగా పట్టణీకరణ జరుగుతున్న మన దేశంలో రాబోయే కాలంలో ప్రయివేటు స్కూళ్లకు వెళ్లేవారు భారీగా పెరుగుతారు. ఇటు ప్రభుత్వానికి పన్ను కట్టటం, అటు ప్రయివేటు స్కూళ్లకు తినీతినక, అప్పులు చేసో కోట్లాది ప్రజలు జేబుల్లో నుంచి ఫీజులు చెల్లించటం అనివార్యం. ఈ పరిస్థితిని మార్చి, విద్యలో పెట్టే ఖర్చుకు విద్యా ప్రమాణాలను మన పన్నుల డబ్బుతోనే అందించాలన్న చర్చ మొదలవ్వాలి. ఆసక్తి ఉన్నకొద్దిమంది ఇంటర్నేషన్ స్కూల్స్ కి వెళ్లొచ్చు. కానీ మిగిలినవారందరికీ నాణ్యమైన విద్యను, ప్రభుత్వ నేతృత్వంలో అందించటం అవసరం. విద్యలో అవసరానికి మించి సైతం చేస్తున్న ఖర్చు విద్యాప్రమాణాలరీత్యా ఎంత సద్వినియోగ మవుతోందీ, ప్రభుత్వ చేతగానితనం వల్ల ప్రజల పన్నుల డబ్బు ఎంత దుర్వినియోగమవుతోందీ, కొన్ని దశాబ్దాల క్రితం రూ.10 ఫీజుతో విద్యార్థులు ఒక్కో తరగతి చదువుకున్నా, రూ. 50-70 నెలజీతంతో ఉపాధ్యాయులు బోధన చేసినా ఎందుకు ప్రపంచ స్థాయి వైద్యులు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలు, నాయకులు, నిష్ణాతులను తయారుచేయగలిగాయా..తెలుసుకోవటానికి ఎన్.ఎస్.ఎస్ సీఎంఎస్ పాఠశాల విద్యా సర్వే 2025 ఉపయోగపడుతుంది.

**ప్రయివేటు చదువులకు భారీగా ఖర్చు చేస్తున్న పట్టణ భారత ప్రజలు**




దేశవ్యాప్తంగా ఇప్పటికీ మన దేశంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. అయితే పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులే ఈ స్కూళ్లలో అధికంగా చదువుతున్నారు. మరోవైపు, ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రయివేటు స్కూళ్లలో 10 రెట్లు ఫీజులు అధికంగా ఉన్నాయి. ట్యూషన్ కోచింగ్ దీనికి అదనం. ప్రతి ముగ్గురిలో ఒకరు ప్రయివేటుగా కోచింగ్ తీసుకుంటున్నారు. ఇది పట్టణ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా ఉంది.

✦ ప్రభుత్వ స్కూళ్లలో చేరిన పిల్లల్లో కేవలం 26.7% కోర్సు ఫీజు చెల్లిస్తున్నారు. ఇదే ప్రభుత్వేతర పాఠశాలల్లో 95.7% మంది విద్యార్థులు ఫీజు కడుతున్నారు. వివిధ రకాల



ప్రభుత్వేతర స్కూళ్లలో కోర్సు ఫీజు చెల్లిస్తున్న విద్యార్థుల్లో 98.0% పట్టణ ప్రాంతాలలోని ప్రయివేటు అన్ ఎయిడెడ్ స్కూళ్లలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 25.3% పిల్లలు మాత్రమే ప్రభుత్వ స్కూళ్లలో ఫీజు చెల్లిస్తున్నారు.

✦ దేశంలో 55.9% మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో 66% మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కేవలం 30.1% మందే ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. వీరి చదువుల కోసం ఒక్కో కుటుంబం రూ. 2,863 ఖర్చు చేస్తోంది.

✦ ప్రయివేటు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు దేశవ్యాప్తంగా 31.9% మంది ఉన్నారు. వారిపై ఒక్కొక్క కుటుంబం సగటున రూ. 28,693 వరకూ ఖర్చు చేస్తోంది. ఇది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పోలిస్తే 10 రెట్లు అధికం.

✦ ఈ ఏడాది పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల్లో 27 శాతం మంది ప్రయివేటు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందులో పట్టణ ప్రాంతాలవారు 30.7%, గ్రామీణ ప్రాంతాల్లోనివారు 25.5 శాతం ఉన్నారు.

✦ పట్టణ ప్రాంతాల్లో ప్రయివేటు కోచింగ్ కు ఏటా తలసరి రూ. 3,988 ఖర్చవుతుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1,793 ఖర్చవుతోంది. ఉన్నత పాఠశాల విద్యార్థులకు పట్టణ ప్రాంతాల్లో కోచింగ్ వ్యయం ఏటా రూ. 9,950 అవుతుండగా.. గ్రామాలలో రూ. 4,548 అవుతోంది.

✦ 90 శాతానికిపైగా విద్యార్థుల చదువులకయ్యే వ్యయాన్ని కుటుంబ సభ్యులే భరిస్తున్నారు. ప్రభుత్వ ఉపకార వేతనం ద్వారా చదువుకునే విద్యార్థులు కేవలం 1.2 శాతమే.

✦ అన్ని రకాల పాఠశాలలనూ కలిపి చూస్తే సగటున ఒక్కో విద్యార్థికి కోర్సు ఫీజు వ్యయం రూ. 7,111 అవుతోంది. పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ కోసం రూ. 2,002 వ్యయం చేయాల్సి వస్తోంది.

✦ పట్టణ ప్రాంతాల్లో కోర్సు ఫీజు సగటున రూ. 15,143 ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 3,979గా ఉంది.

ఎన్.ఎస్.ఎస్ పాఠశాల విద్య సర్వేను ఇంతకు ముందు జులై 2017–జూన్ 2018లో నిర్వహించింది. అయితే 2025లోలా అంగన్వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా అప్పుడు విభజించలేదు. ప్రయివేటు కోచింగ్‌ను కూడా స్కూలు విద్యావ్యయంలో భాగంగా చూపారు. ఈ నేపథ్యంలో.. రెంటి మధ్యా ఒక పరిధి దాటి పోలికలు డేటా లోపాలకు దారితీయవచ్చని గణాంకాలు, కార్యక్రమ అమలు యూనియన్ మంత్రిత్వ శాఖ ముందుజాగ్రత్తగా పేర్కొంది.

**చదువులు పెరుగుతున్నా.. తగ్గుతున్న పిల్లల సంఖ్య**

మన దేశంలో చదువు పెరుగుతున్నకొద్దీ (నాణ్యతతో సంబంధం లేదనుకోండి) జననాల రేటు (ఒక మహిళ తన సంతానోత్పత్తి కాలంలో కనే పిల్లల సంఖ్య సగటు – టీఎఫ్ఆర్) తగ్గుతోందని యూనియన్ ప్రభుత్వ శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) – 2023 గణాంకాలు పేర్కొంటున్నాయి:

**నిరక్షరాస్యులు: 2.2%**
**ప్రాథమిక విద్య కంటే తక్కువ: 2.2%**
**ప్రాథమిక విద్య: 2%**
**మాధ్యమిక విద్య: 2%**
**పదో తరగతి: 1.8%**
**ఇంటర్: 1.7%**
**డిగ్రీ, ఆపైన: 1.6%**

❖

# తెలంగాణలో ఒక్కో విద్యార్థిపై తల్లిదండ్రుల ఖర్చు రూ.36,847

తెలంగాణలోని తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం జాతీయ సగటు కంటే ఎక్కువ సొంతంగా జేబుల్లో నుంచి ఖర్చు చేస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్య (ఎల్.కె.జి) నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రయివేటు పాఠశాలల్లోనే చదివిస్తూ వారిపై ఏడాదికి సగటున రూ.36,847 (జాతీయ స్థాయి సగటు రూ.25,002) వ్యయం చేస్తున్నారు. ఈ ఖర్చు దక్షిణాదిన తమిళనాడులో (రూ.37,723) అధికంగా ఉండగా, తర్వాతి స్థానంలో తెలంగాణ ఉంది. ఆ తర్వాత కర్ణాటకలో రూ.36,557 ఖర్చు చేస్తున్నారు. జాతీయ నమూనా సర్వే (ఎన్.ఎస్.ఎస్) 80వ నమూనా సర్వేలో భాగంగా పాఠశాల విద్యలో నిర్వహించిన సీఎంఎస్ 2025 .. స్కూలు ఫీజు, రవాణా, యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీ, ఇతర ఖర్చులన్నింటినీ లెక్కలు వేసి తల్లిదండ్రులపై ట్యాక్స్ లకు అదనంగా వ్యక్తిగత ఖర్చు భారాన్ని లెక్కేసింది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ/ నగర ప్రాంతాలలో పిల్లల చదువులపై 14% ఈ అదనపు ఖర్చు చేస్తున్నారు. అమ్మాయిల కంటే అబ్బాయిలకు కాస్త ఎక్కువ మొత్తం ఖర్చు చేస్తున్నరని తెలిపింది.

**దక్షిణాదిలో నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్**

ఏపీలో అన్ని రకాల ప్రభుత్వేతర పాఠశాలల్లో చదివేవారు ఒక్కొక్కరూ సరాసరిన రూ.32,683 చొప్పున వ్యయం చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఇది జాతీయ స్థాయి కంటే ఎక్కువ.

⏭ రాష్ట్రంలో కోర్సు ఫీజు, రవాణా, ఏకరూప దుస్తులు, పుస్తకాలు, స్టేషనరీ, ఇతర వాటికి కలిపి ఒక్కో విద్యార్థీ సగటున రూ.18,479 వ్యయం చేస్తుండగా, జాతీయ స్థాయిలో రూ.12,616 ఖర్చు చేస్తున్నారు.

⏭ పూర్వ ప్రాథమిక విద్యలో చదువు కోసం ఒక్కో విద్యార్థి గ్రామీణ ప్రాంతంలో రూ.9,478 ఖర్చు చేస్తుండగా.. పట్టణాల్లో రూ.17,814 వ్యయం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాలను కలిపి చూస్తే సరాసరిన రూ.12,086 భరిస్తున్నారు.

⏭ పూర్వ ప్రాథమిక విద్యలోన 3.6%, ప్రాథమిక స్థాయిలో 9.8%, సెకండరీలో 13.5% మంది ప్రయివేటు కోచింగ్ లకు వెళ్తున్నారు. ఇంటర్ లో ఇది 6.2%గా ఉంది. అన్ని స్థాయిల్లో కలిపి సరాసరిన కోచింగ్‌లకు ఏపీలో రూ.6,435 వ్యయం చేస్తున్నారు.

⏭ విద్య కోసం ఒకే ఆదాయ వనరు నుంచి ఖర్చు చేస్తున్న వారు రాష్ట్రంలో 94% ఉండగా.. వీరిలో కుటుంబ సభ్యులు ద్వారా నిధులు పొందేవారు 96.1% ఉన్నారు. ప్రభుత్వ ఉపకార వేతనాలతో చదువుకునేవారు 1.1% ఉన్నారు. ఇతరుల సాయంతో చదువుకుంటున్నవారు 2.8%.

**అన్ని రకాల స్కూల్స్ కలిపి చూస్తే..**

⏭ పిల్లల చదువుల కోసం జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్ లో తల్లిదండ్రులు అత్యధికంగా ఖర్చు చేస్తున్నారు. దక్షిణాదిలో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక తర్వాత ఏపీలో పాఠశాల విద్యకు సగటున చేస్తున్న వ్యయం అధికంగా ఉంది. పూర్వ ప్రాథమిక విద్య (ఎల్.కె.జి) నుంచి ఇంటర్మీడియెట్ వరకు అన్ని రకాల స్కూళ్లలో కలిపి ఒక్కో విద్యార్థిపై రాష్ట్రంలో ఏటా సగటున రూ.18,479 ఖర్చు చేస్తుండగా.. జాతీయ స్థాయిలో ఇది రూ.12,616గా ఉంది. ఇదే వ్యయం తమిళనాడులో రూ.21,526, తెలంగాణలో రూ.20,590, కర్ణాటకలో రూ.18,756. ఏపీలో గ్రామాలు, పట్టణాల్లో కలిపి 1828 కుటుంబాలు, 6,516 మందిని సర్వే చేసి వివరాలు సేకరించారు.

**భారతదేశంలో పిల్లల స్కూలు చదువుకు తల్లిదండ్రులు అత్యధిక వ్యయం (రూ) చేస్తున్న రాష్ట్రాలు..**

| | |
|---|---|
| **అన్ని రకాల స్కూళ్లు:** | |
| హర్యానా | – 25,720, |
| మణిపూర్ | – 23,502, |
| పంజాబ్ | – 22,692, |
| తమిళనాడు | – 21,526, |
| ఢిల్లీ | – 19, 951 |
| **ప్రయివేటు పాఠశాలలు:** | |
| అరుణాచల్ ప్రదేశ్ | – 63,197, |
| ఢిల్లీ | – 46,716, |
| తమిళనాడు | – 44,150, |
| సిక్కిం | – 44,493 |
| **కోర్సు ఫీజు:** | |
| హర్యానా | – 16,405, |
| తెలంగాణ | – 14,026, |
| తమిళనాడు | –13,422, |
| ఢిల్లీ | – 12,672. |

**గ్రామీణంలోనూ అధికమే:**

⏭ గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్యకు ఆంధ్రప్రదేశ్‌లో సగటున ఒక్కొక్కరిపై రూ.14,116 వ్యయం చేస్తుండగా, జాతీయ సగటు రూ.8,382గా ఉంది. పట్టణాలకు వచ్చే సరికి రాష్ట్ర సగటు రూ.26,078 కాగా, జాతీయ సగటు రూ.23,470. ❖

# దేశంలో టీచర్ల సంఖ్య కోటి

## 2024-25 యూడైస్ ప్లస్ నివేదిక వెల్లడి

**భారత్‌లో టీచర్ల సంఖ్య తొలిసారి కోటి దాటిందని యూనియన్ విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడైస్ ం) 2024-25 నివేదిక వెల్లడించింది. 2023-24లో 98,07,600 మేర ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య 2024-25 నాటికి 1,10,22,420 కి పెరిగింది.**

తాజా లెక్కల ప్రకారం.. దేశంలోని ప్రతి పాఠశాలకు ఏడుగురు టీచర్లు, ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక టీచర్ సగటున (జాతీయ విద్యావిధానంసూచించిన సంఖ్య కన్నా మెరుగ్గా) ఉన్నారుజీరో ఎన్ రోల్ మెంట్ స్కూళ్లు 7,993 ఉన్నాయి. విద్యార్థులులేని ఈ పాఠశాలల్లో 20,817 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు 1,04,125 ఉన్నాయి. వీటిల్లో 33,76,769 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దేశంలో అత్యధిక టీచర్లు ఉత్తర్ ప్రదేశ్ లో ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో రాజస్థాన్, మహారాష్ట్రలు ఉన్నాయి. ఈ విషయంలో తెలంగాణ 10, ఆంధ్రప్రదేశ్ లది 12వ స్థానం.

✎ దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గగా, ప్రయివేటు సంఖ్య పెరిగింది.

✎ ఛండీగఢ్ లో అత్యధికంగా ఒక్కో స్కూల్ కు 48 మంది టీచర్లు ఉన్నారు. తర్వాతి స్థానంలో ఢిల్లీ (29), లక్షద్వీప్ (21 మంది) ఉన్నాయి.

✎ విద్యార్థి - టీచర్ నిష్పత్తి సిక్కింలో అతి తక్కువగా ఉంది. అక్కడ 8 మంది విద్యార్థులకు ఒక టీచర్. జార్ఖండ్ లో అత్యధికంగా 36 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో బీహార్, గుజరాత్‌లు(30 మందికి ఒక టీచర్) ఉన్నాయి.

✎ ఛండీగఢ్‌లో అత్యధికంగా ఒక్కో స్కూల్ లో సగటున 1,222 మంది విద్యార్థులున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ (808), కేరళ (391), దాద్రానగర్ హవేలీ, దామన్ దీవులు (339 మంది) ఉన్నాయి.

✎ జాతీయ స్థాయిలో సగటున ప్రతి స్కూల్ కి 168 మంది విద్యార్థులున్నారు.

✎ దక్షిణాదిలో అత్యధిక టీచర్ల సంఖ్యలో తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, పుదుచ్చేరి వరుస స్థానాల్లో ఉన్నాయి.



✎ విద్యార్థి - టీచర్ నిష్పత్తిలో పుదుచ్చేరి (18), తెలంగాణ (21), కేరళ (21), తమిళనాడు (23), ఆంధ్రప్రదేశ్ (25), కర్ణాటక (26) వరుస క్రమంలో ఉన్నాయి.

✎ ఒక్కో పాఠశాలలో సగటున విద్యార్థులు కేరళలో 391, పుదుచ్చేరి 315, తమిళనాడులో 216, తెలంగాణలో 173, కర్ణాటకలో 157, ఆంధ్రప్రదేశ్ లో 138 మంది ఉన్నారు.

**దేశంలోనే అత్యధికంగా ఏపీలో ఏకోపాధ్యాయ పాఠశాలలు, డ్రాపవుట్లు**

2024-25 యూడైస్ ప్లస్ సర్వేలో దేశంలోనే అత్యధికంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. రాష్ట్రంలో గతేడాది 12,912 ఏకోపాధ్యాయ పాఠశాలలుండగా, వీటిలో 1,97,113 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాలల్లో 1-5 తరగతుల వరకు ఒక్క టీచర్ తోనే బోధన చేయిస్తున్నారు. గతేడాది రాష్ట్రంలో 1-5 తరగతులున్న ప్రభుత్వ పాఠశాలలు 34,240 ఉండగా.. వీటిలో 38% ఏకోపాధ్యాయ బడులే. రాష్టంలో 9-12 తరగతుల్లో మధ్యలో చదువు మానేస్తున్నవారి సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో పది మంది లోపు పిల్లలున్న బడులు 9.8% ఉండగా.. 11-20 మంది విద్యార్థులున్నవి 12.9%, 21-30 ఉన్న బడులు 15.8% ఉన్నాయి. 500 మందికి పైగా విద్యార్థులున్న బడులు 6.2% మాత్రమే. ❖

# తెలంగాణలో పెరిగిన 'జీరో' పాఠశాలలు

## ఒక్క విద్యార్థి లేని బడుల్లో దేశంలో 2వ స్థానం


ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. పశ్చిమ బెంగాల్ 3812 పాఠశాలలతో తొలి స్థానంలో ఉండగా, తెలంగాణ 2245 బడులతో ఆ తర్వాతి స్థానంలో నిలిచింది.

ఒకటి నుంచి 12వ తరగతి వరకు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సంబంధించి 2024-25 విద్యాసంవత్సర ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం ప్లస్ (యూడైస్) గణాంకాలను యూనియన్ విద్యాశాఖ ఇటీవల విడుదల చేసింది.

**ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సదుపాయాలు (శాతాల్లో)**

| సదుపాయం | జాతీయ సగటు | తెలంగాణ సగటు |
|---|---|---|
| గ్రంథాలయాలు | 89.00 | 92.90 |
| కంప్యూటర్ సౌకర్యం | 60.20 | 84.00 |
| ఇంటర్నెట్ | 58.60 | 52.90 |
| కిచెన్ గార్డెన్ | 45.60 | 50.90 |
| నీటి సంరక్షణ | 40.00 | 58.70 |
| సైన్స్ ల్యాబ్ | 51.70 | 58.70 |
| సోలార్ విద్యుత్తు | 9.00 | 6.00 |
| ప్రొజెక్టర్ సౌకర్యం | 16.10 | 17.30 |
| డిజిటల్ బోర్డులు | 28.60 | 29.35 |
| డిజిటల్ లైబ్రరీ | 5.40 | 83.40 |

తెలంగాణలోని జీరో పాఠశాలల్లో 1,016 మంది టీచర్లు పని చేస్తున్నారు. కాకపోతే, వారు సమీప పాఠశాలలకు డిప్యుటేషన్ పై వెళ్తున్నారు. జీరో పాఠశాలలు 2022-23లో 1672, 2023-24లో 2097 ఉండగా.. ఈసారి రాష్ట్రంలో మరో 148 పెరగటం గమనార్హం. ఇదేసమయంలో దేశవ్యాప్తంగా ఆ సంఖ్య తగ్గింది.



**ఏకోపాధ్యాయ పాఠశాలల తగ్గుముఖం**

ఇక ఒక ఉపాధ్యాయుడితో నడిచే పాఠశాలల సంఖ్య తెలంగాణలో క్రమేపీ తగ్గుతుండటం ఊరటనిచ్చే అంశం. 2022-23లో 6,054 ఏకోపాధ్యాయ పాఠశాలలుండగా.. 2023-24లో ఆ సంఖ్య 5,895కి తగ్గింది. ఈసారి 2024-25లో 5001కి తగ్గింది. వాటిల్లో 62,288 మంది విద్యార్థులు చదువుతున్నారు. అంటే సగటు విద్యార్థుల సంఖ్య 12.

పది మందిలోపు విద్యార్థులున్న బడుల సంఖ్య తెలంగాణలో 12.70 శాతానికి పెరిగింది. అంతకుముందు సంవత్సరం అది 11.60 శాతమే. ఈ అంశంలో జాతీయ సగటు 5.10 శాతం మాత్రమే. ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, లఢఖ్ లలో మాత్రమే పరిస్థితి రాష్ట్రం కంటే అధ్వాన్నంగా ఉంది. ❖

## విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకుంటే పావలా వడ్డీకే రుణం

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే ప్రతీ విద్యార్థికి పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు ఇచ్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పథకాన్ని రూపొందించనుంది. 4% వడ్డీకే బ్యాంకు రుణాలు ఇవ్వడంతో పాటు, దానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది. ఈ రుణాన్ని 14 ఏళ్లలో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించనున్నారు. దేశంలో ఐఐటీ, ఐఐఎం, నిట్ వంటి సంస్థల్లో చదివే వారికి కూడా ఈ పథకాన్ని వర్తింప జేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# మంత్రులుగా యంత్రాలు

ఐరోపాలో ఆల్బేనియా పేరు మనలో చాలామందికి తెలుసు. 28 లక్షల జనాభా. ఆ దేశం యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో చేరాలని కోరుకుంటోంది. అయితే అవినీతిరహిత దేశంగా మారితేనే చేర్చుకుంటామని ఈయూ షరతు విధించింది. అవినీతి నియంత్రణ మనుషులతో చేయటానికి రాజకీయ అవరోధాలు చాలా వస్తాయి కాబట్టి ఆ దేశ ప్రధానమంత్రి ఎడీ రమా ఒక ఐడియా వేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ఒక రూపాన్ని సృష్టించి అవినీతి నిరోధక శాఖ మంత్రి పదవి ఇస్తే నిర్మొహమాటంగా, అలసిపోకుండా అవినీతిని కట్టడి చేస్తుందని భావించారు. పౌర సేవల విభాగంలో డిజిటల్ సేవలను సమర్థంగా అందిస్తున్న 'డియెల్లా'ను సదరు శాఖకు కేబినెట్ మంత్రిగా ప్రమోట్ చేశారు. ఆల్బేనియాలో డియెల్లా అంటే సూర్యుడు అని అర్థం. ఏఐ మంత్రిగారి డ్రెస్ కోడ్ కూడా స్థానిక ఆచార వ్యవహారాలకు తగ్గట్టుగానే ఉంటుంది. ఈ వర్చువల్ మహిళా మంత్రి ప్రజాధనంతో చేపట్టే పనుల్లో సమూల మార్పులు తీసుకొస్తుంది. ప్రభుత్వ టెండర్లలో కుమ్మక్కులు, దోపిడీ లాంటివి లేకుండా పారదర్శకతతో జరిగేలా చూస్తుంది.

**పార్లమెంటులోనూ ఏఐ మంత్రి ప్రసంగం**

'ప్రజాసేవ, వ్యవస్థల గురించి రాజ్యాంగం చెబుతుంది. మన విధులు, జవాబుదారీతనం, పారదర్శకత, వివక్షకు తావులేని సేవల గురించి వివరిస్తుంది. నేనూ మనుషుల మాదిరిగానే ఆ విలువలకు కట్టుబడి ఉంటా. ఏమో.. మీ కంటే ఎక్కువగానే ఉంటానేమో. నేను మనుషులకు బదులుగా కాకుండా వారికి సాయం చేయటానికి వచ్చాను' అని పార్లమెంటులో కూడా ఏఐ మంత్రి డియెల్లా తన రాజ్యాంగబద్ధ విధి నిర్వహణ గురించి మాట్లాడింది. అయితే డియెల్లా నియామకమే రాజ్యాంగ విరుద్ధమనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

వినటానికి, నిరసన వ్యక్తం చేయటానికి ఈ ఆలోచన ఆసక్తికరంగా ఉందిగానీ.. దీనివల్ల చాలా సమస్యలూ వస్తాయి. భారత రాజ్యాంగం ఎంతో ఉదాత్తమైనది, వైవిధ్యాల్ని, వైరుధ్యాల్నీ అద్భుతంగా కలిపి ఉంచగలిగింది. ఎలాగైతే నెమలి, పాము, ఎలుక ఇలా శత్రు జంతువులన్నీ మన దేవుళ్ల సన్నిధిలో కలిసిమెలిసి ఉంటాయని చెబుతారో, అలా భారత రాజ్యాంగం పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్న



బృందాల్నీ కలిపి ఉంచుతుంది. కానీ రాజ్యాంగంలో కొన్ని నిశ్శబ్దాలుంటాయి. సైలెన్సెస్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్. కొన్ని అంశాలను కాలానుగుణ పరిస్థితులకూ మన రాజ్యాంగ నిర్మాతలు వదిలేశారు. అలాంటివి మానవ నేతలు అర్థం చేసుకోగలరు, సృజనాత్మకంగా పరిష్కరించగలరు తప్ప రోబోలు చేయలేవు. ఇంకో ఉదాహరణ. ఏదైనా ఆందోళన జరిగితే, రోబో లెక్కప్రకారం తుపాకులతో కాల్చిపారేయాలి. అది ఎలాంటి ఆందోళన, వారిని సంయమనంతో నియంత్రించాలా, వారి పట్ల కఠినంగా వ్యవహరించాలా అనే విచక్షణ మానవ నేతలకు మాత్రమే ఉంటుంది. అన్నిటికంటే పెద్ద సమస్య యంత్రాలు మంత్రులైతే ఏదైనా పొరపాటు జరిగితే ఎవరిని ప్రశ్నించగలం? అందువల్ల ఈ చర్చ మన అసమర్థతను, అవినీతిని, అమానవీయతను, అసభ్య తిట్ల సంస్కృతిని ఎత్తిచూపే ఒక హెచ్చరికగా భావించి రాజకీయ, పాలనా, ఆర్థిక వ్యవస్థల్ని సంస్కరించుకుందాం. పదవిని పెత్తనంగా కాకుండా సేవగా గుర్తిద్దాం. రోబో, ఏఐ ఇలా అన్ని రకాల సాంకేతికతల్ని వాటి పరిధి మేరకు పరికరాలుగా మాత్రమే ఉపయోగించుకుందాం.

**తెలంగాణ శాసనవ్యవస్థలో ఏఐ వినియోగం**

**తిట్ల భాష ఆపండి.. ప్రజల గురించి మాట్లాడండి: సభాధ్యక్షులు**

ఇటీవలికాలంలో ప్రజాప్రతినిధులు వాడుతున్న భాష కొంత ఆందోళనకరంగా ఉందని.. శాసనసభ వ్యవస్థను, చట్టాలను

గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బెంగళూరులో జరిగిన 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్, ఇండియా రీజియన్ సమావేశాల్లో మాట్లాడుతూ, 'చట్టసభల్లో చర్చలు గౌరవప్రదంగా ఉండాలి. సభ్యుల భావవ్యక్తీకరణను, భిన్నఅభిప్రాయాలను పరస్పరం గౌరవించుకోవాలి. చర్చల్లోనూ ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే ప్రజల విశ్వాసాన్ని చూరగొనగలం. కానీ, ఇటీవల సభల్లో అర్థవంతమైన చర్చలు జరగటం లేదు. దాంతో చట్టసభల కార్యకలాపాలపై ప్రజల్లోనూ ఆందోళన నెలకొంది. తెలంగాణ శాసనవ్యవస్థలో ఏఐ వినియోగంతో.. పరిశోధన, రికార్డుల నిర్వహణతో పాటు నిర్దిష్ట సమాచారంతో కూడిన చర్చలకు అవకాశం లభిస్తోంది' అని సుఖేందర్ రెడ్డి వివరించారు.

**చట్టసభలు పవిత్ర మందిరాలు**

ప్రజాస్వామ్యంలో చట్టసభలు పవిత్ర మందిరాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 'ప్రజల నమ్మకాన్ని పెంపొందించటానికి చట్టసభలు కృషి చేయటం, ప్రజా ఆకాంక్షలను నెరవేర్చటం' అనే అంశంపై ఆయన మాట్లాడారు. చట్టసభల్లో జరిగే చర్చలు ప్రజల ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. చర్చలు నిర్మాణాత్మకంగా జరగాలన్నారు. 'రాష్ట్రంలో ఇటీవల శాసనసభ సమావేశాలు



అర్థరాత్రి వరకు జరిగాయి. ప్రతి శాసనసభలో సంవత్సరంలో విధిగా ఎన్ని రోజులు సమావేశాలు జరగాలనేది నిర్ణయించాలి. నూతన సభ్యులకు అవగాహన, శిక్షణ తరగతులను నిర్వహించాలి' అని సూచించారు. సమావేశంలో తెలంగాణమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు. ❖

## 10% ఓట్లు వస్తే లోక్‌సత్తా రాజకీయ వ్యవస్థనే మార్చేసేది..
## 40% ఓట్లు, 11 మంది ఎమ్మెల్యేలున్నా జగన్ పలాయనం ఏమిటి?

ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనటం తగదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పది శాతం ఓట్లు లోక్ సత్తాకు నిలకడగా వచ్చి ఉంటే, ఈపాటికి రాష్ట్ర, దేశ రాజకీయాన్ని మార్చేసేదని, 40% ఓట్లు వచ్చినా జగన్ నిష్క్రియాపరత్వాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. సంక్షేమం తప్ప అభివృద్ధి అక్కర్లేదు, అభివృద్ధి కోరేవారు పేదలకు, ఆ కులంవారు ఈ కులంవారికిశత్రువులు.. వంటి అసమర్థ, విద్వేష విధానాల వల్ల వైకాపా ఓటమి పాలైందన్నారు. ఇది విధానపరమైన అంశం తప్ప వ్యక్తిగతం కాదన్నారు. కనీసం తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డిని చూసైనా జగన్ రాజకీయం, పాలన నేర్చుకోవాలన్నారు. నలభై శాతం ప్రజల ఆకాంక్షల్ని, పది మంది ఎమ్మెల్యేల బాధ్యతను అవమానించటం తగదన్నారు. వైకాపా తరపున 2024లో ఎన్నికైనవారిలో నలుగురు కొత్తవారని, అందులో ఇద్దరు అరకు, పాడేరు లాంటి గిరిజన ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. వీరు అసెంబ్లీకి వెళ్లకుంటే ప్రజల సమస్యలు సభలో ఎలా ప్రస్తావనకు వస్తాయని, ఓటర్లకు ముఖం ఎలా చూపగలరని ప్రశ్నించారు. విజయనగరం లోక్ సత్తా కార్యాలయంలో బాబ్జీ మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనలోని ఉచితాల్ని అధిగమించటానికి చంద్రబాబు ప్రభుత్వం కూడా భారీ పందేరాలు చేస్తోందని, రాష్ట్ర ప్రజల పరిస్థితి ఈ విషయంలో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందన్నారు. అయితే అభివృద్ధి విషయంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం వేగంగా వ్యవహరిస్తోందన్నారు. అదేవిధంగా, పెద్దగా ఎవరూ ఇష్టపడని పంచాయితీ రాజ్ శాఖను తీసుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అక్కడ కొంతైనా నిధుల్ని అందిస్తున్నారన్నారు. మితిమీరిన తాత్కాలిక పథకాలు, నగదు బదిలీలపై చంద్రబాబును సభలో ప్రశ్నించటంతోపాటు అభివృద్ధిలోని లోటుపాట్లను, విద్య, ఆరోగ్య రంగాల్లో లోపాలను జగన్, వైకాపా సభ్యులు నిర్మాణాత్మకంగా విమర్శిస్తే ప్రజలు మెచ్చుతారన్నారు. సమావేశంలో లోక్ సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం, కార్పొరేషన్ అధ్యక్షుడు తాత్రాజు రాజారావు, ప్రధాన కార్యదర్శి పి.ఎల్.ఎన్ రాజు, ఉపాధ్యక్షుడు బోర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై చర్చ - అడగని ప్రశ్నలు

ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ నివేదిక, ఎన్.డి.ఎస్.ఎ అధ్యయనం మొదలైన వాటిపై తెలంగాణ అసెంబ్లీలో అర్థరాత్రి దాకా చర్చ జరిగింది. శాసనసభ ప్రత్యేక సమావేశం మీద ఢిల్లీలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. అప్పుడు ఆయనో మాట అన్నారు. 'కేసీఆర్ ఇప్పటికే తన ఫాంహౌస్ లో బందీగా ఉన్నారు. ఇంకా ఆయన్ని జైల్లో పెట్టటం ఎందుకు' అని. అసలు దోషులకు శిక్ష చివర్లో ఉంటుందన్న సీఎం హఠాత్తుగా మాట మార్చారు. దోషుల్ని శిక్షించటం కాకుండా.. కేవలం ఆ నివేదికతో కేసీఆర్‌ను, ఆయన స్థాపించిన బీఆర్ఎస్‌ను బద్నాం చేయటమే లక్ష్యంగా అసెంబ్లీ చర్చ ఉంటుందన్న అంచనా అప్పుడే మొదలైంది. అంతకుమించి ఆ నివేదికలతో చేసేదేమీ లేదని చెప్పటానికి సహేతుక ఆధారాలు కనిపిస్తున్నాయి. అది కూడా రాజకీయంగా, చరిత్రపరంగా నష్టదాయకం కాబట్టి, అసలు జస్టిస్ ఘోష్ నివేదికను విడుదల చేయకుండా, అసెంబ్లీలో చర్చించకుండా చూడాలని కేసీఆర్, అప్పటి నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్ రావు తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. చట్టబద్ధపాలనతో శిక్షించకుండా.. పోలీసుల్ని, దర్యాప్తు సంస్థల్ని గుప్పెట్లో పెట్టుకుని నిందితుల పరువు తీయటమే అధికార పార్టీ రాజకీయ ఒరవడిగా కొనసాగుతోంది కాబట్టి.. అసెంబ్లీలో చర్చపై హైకోర్టు జోక్యానికి ముందే మీడియాకు ఆ నివేదికను రేవంత్ ప్రభుత్వం లీక్ చేసింది. అంతకుముందు కాళేశ్వరం లీకేజీలతోపాటు, ప్రాజెక్టుకి సంబంధించి పనిచేసిన ఇంజినీర్ల వద్ద కట్టలు కట్టల లెక్కచెప్పని డబ్బు దొరికిన నేపథ్యంలో విషయమైతే అందరికీ అర్థమైంది. సినిమా కథతెలిసినా, ట్విస్టులు ఎలా ఉంటాయో తెలుసుకోవటం కోసం తహతహలాడే ప్రేక్షకుల్లా ప్రజలు అసెంబ్లీ చర్చను వీక్షించారు.

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి సుధాకరరెడ్డి వంటి వారు బి.ఆర్.ఎస్‌ను కడిగేస్తారని థ్రిల్లర్ సినిమాలా, 20-20 క్రికెట్‌లా ఉత్కంఠగా చూసిన ప్రజలకు నిరాశ ఎదురైంది. ఏదో ముందే ఒప్పందం కుదిరినట్లు, అందరూ చాలా మొక్కుబడిగా హరీష్ రావును విమర్శించారు. ఘోష్ కమిషన్ నివేదికలో నీటిపారుదల మంత్రి హరీష్ రావు కంటే కేసీఆర్ పేరును స్పష్టంగా, ఎక్కువ సార్లు ప్రస్తావించినా, అసెంబ్లీ చర్చలో పెద్దగా పెద్ద సారు ప్రస్తావన రాలేదు. వాగ్ధాటికి



పేరొందిన రేవంత్ రెడ్డి చేతిలో అనేక అస్త్రాలున్నా, చప్పగా మాట్లాడారు. చాలామంది ఎమ్మెల్యేలకు విషయం అర్థమవుతున్నా, 665 పేజీల నివేదికను అప్పటికప్పుడు చదివి స్పందించటమనటంలోని మతలబు తెలుస్తున్నా..తమ నేతల వాగ్ధాటి, వారి హావభావాల్ని పరిశీలిస్తూ చర్చలో కాస్తయినా నిజాయతీ ఉందా?మొత్తం మ్యాచ్ ఫిక్సింగా? అని నిశితంగా బేరీజు వేసుకునే ప్రయత్నం చేశారు. అనేక లొసుగులున్నా, హరీష్‌రావు చాలా సమర్థంగా సమాధానాలిచ్చారు. బి.ఆర్.ఎస్ పార్టీ సోషల్ మీడియా షేర్ చేసినట్లు, ఆరడుగుల బుల్లెట్ లా వ్యవహరించారు.

ఇక ఆ తర్వాత కేసీఆర్ కుమార్తె కవిత తిరుగుబావుటా ఎగురవేస్తూ హరీష్‌రావును, తమ చుట్టం సంతోష్‌రావును టార్గెట్ చేస్తూ పలు ఆరోపణలు చేశారు. హరీష్ రావు అసెంబ్లీలో మాట్లాడినదంతా బోగస్, కాళేశ్వరం సహా అనేక అంశాల్లో భారీ అవినీతి జరిగిందని కవిత తేల్చిచెప్పారు. అయితే, తన తండ్రి నిర్దోషి, ఆయనకు తెలియకుండా అవినీతి చేశారని తెలిపారు. కేసీఆర్ గూగుల్ మ్యాప్‌లతో కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల డిజైన్ చేసిన ఫొటోలు పలు పత్రికల్లో వచ్చాయని ఆమె మరచిపోయారు. కేసీఆర్ ప్రమేయం లేనప్పుడు ముఖ్యమంత్రిగా ఆయన తనకు తెలిసిన అవినీతి భాగోతంపై ఎందుకు చర్యలు తీసుకోలేదు, కవిత ఈ విషయాల్ని ముందే ఎందుకు చెప్పలేదు, కవితను డామినేట్ చేస్తారనే భయంతోనే మొదటి విడతలో మహిళా మంత్రిని నియమించలేదనే ఆరోపణ ఎదుర్కొంటున్న కేసీఆర్ అనుమతి లేకుండానే కవిత అలాంటి ఆరోపణలు చేస్తారా? హరీష్‌రావు, సంతోష్‌రావు మొదలైనవారు పాపాల భైరవుడి పాత్రలకు అంగీకరించారా?.. మనకు తెలియదు. రాజకీయ పార్టీలు సొంత ఎస్టేట్‌లుగా నడుస్తున్నప్పుడు ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయి.

కాళేశ్వరం అవినీతితోపాటు మనకు ఇక్కడ కావలసిన అంశాలు అంతకంటే ముఖ్యమైనవి. మొదటిది, అసలు కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రజలకు ప్రయోజనం ఉందా? ప్రజలంటే రైతులు కూడా. తెలంగాణ మొత్తానికీ ఎంత విద్యుత్ ఖర్చవుతుందో, ఒక్క కాళేశ్వరానికే అంత ఖర్చవుతుందని, ఎకరాకు ఏడాదికి రూ.20,000 ఆదాయం వస్తుందనుకుంటే, ఆ ఎకరాకు నీళ్లివ్వటానికి తొలినాళ్లలో రూ.5 లక్షలు, ఆ తర్వాత రూ.80 వేలకు పైగా ఖర్చవుతా యని అంచనా. ఇంతా చేసి వ్యవసాయం లాభసాటి కాదు. దీనికితోడు సాగుకి ఇచ్చే ఉచిత విద్యుత్‌కు మీటర్లు లేక పోవటం వల్ల రైతుల పేరు చెప్పి ఇతరులు దొంగిలించటం. కాళేశ్వరం ప్రాజెక్టు అసంబద్ధమైనదని, తెలంగాణ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేదని ఆ ప్రాజెక్టుకు ఐడియాగా పనిచేసిన ప్రాణహిత-చేవెళ్ల ప్రతిపాదన (2008) నాటి నుంచి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ వాదిస్తున్నారు. అప్పట్లో జేపీ ఒక్కరే ఆ మాట పదేపదే చెప్పారు. అదే డబ్బుని తెలంగాణలో చిన్న పట్టణాల అభివృద్ధికి ఉపయోగించి అంతా హైదరాబాద్‌లో కేంద్రీకరించకుండా, జిల్లాలకు వికేంద్రీకరిస్తే యువతకు తమ గ్రామాల చుట్టూనే మంచి ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రత్యామ్నాయం సూచించారు. హైదరాబాద్‌కి పొట్ట చేత పట్టుకుని వచ్చి ఇరుకు గదుల్లో, ట్రాఫిక్ జామ్ లలో దుర్భర జీవితం గడపాల్సిన అవసరం లేకుండా, ఉమ్మడి కుటుంబాల్లో ఉంటూనే ఆదాయాలు పెంచు కోవచ్చన్నారు. అప్పట్లో కేసీఆర్ కూడా జేపీ వాదనను సమర్థించారు. ఆ తర్వాత రాష్ట్రం ఏర్పడ్డాకఆయనేకాళేశ్వరం చేపట్టి, ప్రాజెక్టును విమర్శించినందుకు తెలంగాణ అసెంబ్లీలో జేపీ మీద మాటల దాడి చేశారు. ఈ అసలు విషయంగానీ, నాణ్యతతో, నిర్వహణతో సంబంధం లేకుండా కాళేశ్వరం కట్టటమే తెలంగాణకు భారీ నష్టమనే విషయం గానీ అసెంబ్లీలో, బయటా ఎక్కడా చర్చకు రాలేదు. రాలేదు సరికదా.. ప్రాణహిత-చేవెళ్ల మళ్లీ కొనసాగిస్తామని, మూసీకి లక్ష కోట్లకు పైగా ధారపోస్తామని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.

ఇక రెండో అంశం, హరీష్‌రావు అసెంబ్లీలో మాట్లాడుతూ, కేవలం ఈ చర్చలో పాల్గొనటం కోసమే తాను విదేశీ పర్యటనను వాయిదా వేసుకున్నానని తెలిపారు. తన కుమార్తెను లండన్‌లో విద్యార్జన నిమిత్తం తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఇక్కడ కాంగ్రెస్ వారెవరూ అడగాల్సిన ప్రశ్నను అడగలేదు. విద్యామంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ కూడా అడగలేదు - 'హరీష్ రావు గారూ, సంపన్న తెలంగాణ రాష్ట్రంలో మీరు పదేళ్లు అధికారంలో ఉన్నారు. మీ పిల్లల్ని కూడా జాయిన్ చేయలేని రీతిలో విద్యారంగాన్ని ఎందుకు తయారుచేశారు? విద్యను ఎందుకు బాగు చేయలేదు?' అని.

అదేవిధంగా, కవిత కూడా తన రెండో కుమారుడ్ని జాయిన్ చేయటం కోసం అమెరికా వెళ్లి తిరిగొచ్చాక తీరిగ్గా ప్రెస్ మీట్ పెట్టారు. ఆమెను మీడియా వాళ్లూ అడగలేదు. పదేళ్లలో తెలంగాణలో మీ పిల్లల్ని చదివించలేని స్థాయిలోనే విద్యారంగం కొనసాగటానికి కారణమేమిటి? మీ పిల్లలకో న్యాయం, మిగిలిన తెలంగాణ బిడ్డలకు ఒక న్యాయమా? ఇందులో అసూయేమీ లేదు. కచ్చితంగా మెరుగైన అవకాశాల కోసం విదేశాలు సహా ఇతర చోట్లకి వెళ్లవచ్చు. కానీ మనం వారికి దీటుగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నా.. వినియోగించుకోకపోతే ఎలా? అధికారంలో లేనివారిని, పౌరుల్ని ఈ ప్రశ్న అడగలేం. కానీ పదేళ్లు అధి కారంలో ఉన్న పార్టీ, తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకత్వం ఉన్న పార్టీ నేతల్ని, అందులోనూ అగ్రనేతల్ని కచ్చితంగా ఈ ప్రశ్న అడగాల్సిందే. కాళేశ్వరం ద్వారా వ్యవసాయం చేయటం ద్వారా తెలంగాణ యువత బాగు పడతారా, ప్రపంచంలో ఎక్కడైనా బతకగలిగే చదువు ద్వారా బాగుపడతారా? అని జాతీయ మీడియా సహా ఏ జర్నలిస్టూ అడగలేదు.

కాళేశ్వరం అవినీతి, నిర్మాణం, నిర్వహణ అవకతవకలపై చట్టం ప్రకారం శిక్షించాల్సిందే. కానీ అంతకంటే ముఖ్యం - ప్రజాధనాన్ని ఓ జలగం వెంగళరావులా, ఓ ఎన్.టి రామారావులా సద్వినియోగం చేయకుండా కాళేశ్వరం లాంటి అసంబద్ధమైన ప్రాజెక్టుని ఎందుకు చేపట్టారు? దాన్నుంచి పాఠం నేర్చుకోకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల, మూసీ ప్రక్షాళన-సుందరీకరణకు అంతంత డబ్బుతో ప్రతిపాదనలు ఎందుకు చేస్తోంది? తెలం గాణలో హైదరాబాద్ లాంటి మహానగరం ఉన్నా విద్యారం గాన్ని ప్రపంచస్థాయికి పాఠశాల దశ నుంచి ఎందుకు బాగుచేయలేదు?

.. ఈ ప్రశ్నల్ని లేవనెత్తాల్సిన చట్టసభ, కార్యనిర్వాహక వ్యవస్థ, రాజకీయ పార్టీలు, మీడియా అదేదో రసవత్తర కుటుంబ గాథా చిత్రంలా చూడటం విషాదకరం. తెలుగు ప్రజలు, భారతీయులు, ముఖ్యంగా తెలంగాణలో పన్నులు కడుతున్నవారు పట్టించుకోవాల్సిన అసలైన ప్రశ్నలివి. ఆ తర్వాత చేయవలసింది - అవినీతి అంతానికి, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ ప్రక్షాళనకి, వీటన్నిటికీ మూలమైన ఎన్నికల్లో ఓట్ల కొనుగోలును కట్టడి చేసే వ్యవస్థీకృత సంస్కరణలకి కాస్త అవగాహనతో కృషి.

❖

# పోస్టాఫీసుల్ని శాశ్వత ఓటరు నమోదు కేంద్రాలు చేయండి..
# సాంకేతికతతో పారదర్శక చర్యలు తీసుకోండి

**మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్‌లలో 'ఓట్ చోరీ' తరహా ఆరోపణలు, అనుమానాల నేపథ్యంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్ డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పందనలోని కొన్ని ముఖ్యాంశాలు:**

ఎటువంటి వివక్షా లేకుండా వయోజనులందరికీ సమాన ఓటు హక్కుని స్వతంత్రం వచ్చినప్పటి నుంచే ఇచ్చిన తొలి దేశం భారత్. ఓటుకి-తమ జీవితానికి సంబంధం ప్రజలకు అర్థమయ్యే వ్యవస్థను ఆ రోజునే నిర్మించక పోవటం వల్ల పలు లోపాలు కొనసాగుతున్న మాట వాస్తవం. అయినా ఓటును తన సార్వభౌమాధికారానికి సంకేతంగా ఈ దేశంలో చిట్టచివరి పౌరుడు సైతం భావిస్తాడు. రాజకీయ పార్టీలు, నేతలు ఎంత సంపన్నులైనా, గొప్పవారైనా, ఎంత కేంద్రీకృత అధికారం గలవారైనా వారిని తన వద్దకు రప్పించేది ఓటు హక్కేనని సామాన్యులు నమ్ముతారు. తమ సంక్షేమ పథకాలకి ఓటు హక్కే పాస్‌పోర్టు అని వారి భావన. అందుకే మిగతా ఎన్నదగ్గ దేశాలతో పోలిస్తే మన దేశంలో ఎక్కువ ఓట్లు సామాన్యులు, పేదలు, గ్రామీణులే వేస్తారు. ఎన్నికలంటే వారికో పండుగ. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల్లో ఉమ్మడి విజ్ఞతను మన సామాన్య ప్రజలు ప్రదర్శించిన సందర్భాలు అనేకం.

రాజ్యాంగ ప్రతిపత్తి గల మన ఎన్నికల సంఘం (ఈసీ) పోలింగ్ బూత్ లోపల ఓటింగ్ ప్రక్రియ సవ్యంగా జరిగేలా చేయటంలో గత 75 ఏళ్లలో ప్రపంచంలోనే విశ్వసనీయతను సంపాదించుకుంది. అన్ని రకాలుగా ఇంత పెద్ద సంక్లిష్ట దేశంలో ఎన్నికల్ని సవ్యంగా నిర్వహించటం, శాంతియుతంగా అధికార మార్పిడి జరగటం ఆషామాషీ వ్యవహారం కాదు. అయితే ఓటు వేయటానికి మూలమైన ఓటరు జాబితాల్లో ఇప్పటికీ అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. పోలింగ్ బూత్ బయట ఓట్ల కొనుగోలు, మద్యం, ప్రలోభాల పంపిణీ, కులం, మతం రెచ్చగొట్టి విభజనల్ని పెంచటం వంటి చాలా సమస్యలున్నాయి. వాటిని చట్టసభలు, పార్టీలు మాత్రమే పరిష్కరించగలవు. కానీ పోలింగ్ బూత్‌లో స్వేచ్ఛగా ఓటు వేసేలా చేయటం, అందుకు సక్రమంగా ఓటరు జాబితాల్ని అందుబాటులోకి తేవటం వంటివి



చేయాల్సింది ఎన్నికల సంఘమే.


ఎన్నికల జాబితాల్లో అక్రమాలపై భారతదేశంలో నిర్దిష్ట పరిష్కారాలతో గొంతు విప్పి క్షేత్రస్థాయిలో పోరాడిన మొట్టమొదటి రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా. 'ఓట్ ఇండియా' కోసం 2000 సంవత్సరం ప్రాంతం నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో ఎంపిక చేసిన అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇంటింటి సర్వే నిర్వహించింది. పట్టణ ప్రాంతాల్లో 40%, గ్రామీణ నియోజకవర్గాల్లో 15% వరకు లోపాలున్నట్లు తేలింది. ఇది దేశాన్నే దిగ్భ్రాంతి పరచింది. అదే విధంగా హైదరాబాద్ పరిధిలోని సనత్‌నగర్ నియోజకవర్గంలో చేసిన సర్వేలో పోలయ్యాక ఓటరు సంతకాల జాబితాల్ని కూడా ఈసీ నుండి అధికారి కంగా కొనుగోలు చేసి పోల్చి చూసింది. దొంగ ఓట్లు ఏమేర ఉన్నాయోపరిశీలించింది. ఓటరు జాబితాలో అవకతవకల కంటే దొంగ ఓట్లు చాలా తక్కువగా ఉన్నాయి. అంటే, జాబితాలో మరణించినవారు, వేరే చోటికి తరలివెళ్లినవారి పేర్లు కూడా కొనసాగుతున్నాయి.

కొన్ని నిర్దిష్ట పరిష్కారాలను సూచించగా ఎన్నికల సంఘం అంగీకరించింది. ఫలితంగా ఓటరు జాబితాల్లో లోపాలు గణనీయంగా తగ్గాయి. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో 10 శాతం లోపు, గ్రామ ప్రాంతాల్లో 5% లోపు ఉంటున్నాయి. ఈవీఎంలు వచ్చాక దొంగ ఓట్లు కూడా నామమాత్ర మయ్యాయి. ఓటరు జాబితాల్లో లోపాలు ఎంత తక్కువైనా, అవి కూడా ఉండకూడదు. అయితే అందుకు ఈసీ రాజకీయ దురుద్దేశం కారణం కాదు. కమిషనంగా ఎన్నికల సంఘానికి గుర్తింపు తెచ్చిన టీఎన్ శేషన్‌తో లోక్‌సత్తా కలసి పనిచేసింది. శేషన్ సహా ఏ అధికారీ ఎన్నికల ఓటింగ్ తీరును రాజకీయంగా ప్రభావితం చేయలేరు. ఈసీ అంటే ఢిల్లీలో కూర్చునే సీఈసీ, కొద్దిమంది కమిషనర్లు కాదు. కోటి మందికి పైగా ప్రభుత్వోద్యోగులు, లక్షలాది మంది బూత్ స్థాయి సిబ్బంది, పార్టీల ఏజంట్లు ఉంటారు.

పెద్ద చదువులేనివారు కూడా హైరానా పడకుండా తేలిగ్గా తమ ఓటును నమోదు చేసుకునేందుకు, వేరే చోటికి మారినప్పుడు ఆ వివరాలు వెంటనే నమోదై పాత




చిరునామా స్థానంలో కొత్త చోట ఓటు తేలిగ్గా నమోదు గావించుకునేందుకు వీలుగా పోస్టాఫీసుల్ని శాశ్వత ఓటరు నమోదు కేంద్రాలుగా ఏర్పాటు చేయమని లోక్‌సత్తా చేసిన సూచనను ఈసీ అమలు చేయకపోవటం వల్ల జాబితాల్లో అవకతవకలు కొనసాగుతున్నాయి. ఓటరు జాబితాలు రాజకీయ రంగు పులుముకున్నప్పుడు ప్రస్తుతంలా మరింత రచ్చ జరుగుతుంటుంది. ఓటరు ఐడీలో, జాబితాల్లో ఫొటోలతో సహా అందుబాటులోకి తేవటం, పోలింగ్ ప్రక్రియ మొత్తాన్నీ సీసీ టీవీల్లో నమోదు చేయటం వంటి అధునాతన చర్యల్ని ఈసీ తీసుకుంటోంది. అదేవిధంగా, ఎవరు ఎక్కడున్నా ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకునేందుకు, అవసరమైన మార్పులను ఎప్పుడైనా గావించుకునేందుకు ఆన్‌లైన్ ఏర్పాట్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కానీ మనకు మొబైల్ ఫోన్లున్నా




డిజిటల్ అక్షరాస్యత ఇంకా పూర్తిస్థాయిలో పెరగలేదు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి సవరణలు జరగటం లేదు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌తోపాటు, పోస్టాఫీసుల్ని కూడా ఓటరు సవరణల శాశ్వత నోడల్ కేంద్రాలుగా ఏర్పాటు చేయటం, జనన మరణాల్ని ఎప్పటికప్పుడు నమోదు చేసేలా అనుసంధానించటం అవసరం. దీనివల్ల పొరపాట్లు అరుదుగా మాత్రమే దొర్లుతాయి. పోలింగ్‌బూత్‌లో ఐడీల తనిఖీకి పకడ్బందీ వ్యవస్థ ఉంటే, అరుదైన పొరపాట్లను కూడా నియంత్రించి నూరుశాతం అర్హులు మాత్రమే ఓటు వేసేలా చేయవచ్చు. రెండోసారి ఎవరు ఓటు వేయాలనుకున్నా, దొంగ ఓటు వేయాలనుకున్నా సాధ్యం కాదు. సుమారు 100 కోట్ల ఓటర్లున్న మన దేశంలో ఓటరు జాబితాల రియల్ టైం పర్యవేక్షణా వ్యవస్థ స్థాయికి ఎదగటానికి ఇంకా సమయం పడుతుంది. కానీ ఈ లోగా కూడా సమాచార అంతరం, అపోహలకు ఆస్కారం లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా వ్యవహరించటం అవసరం, పోస్టాఫీసుల ద్వారా ఆచరణసాధ్యం.

ఇక రాజకీయ పార్టీలు ఈసీ మీద మితిమీరిన భారం మోపకుండా.. దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, మేనిఫెస్టోల్లో ఆచరణసాధ్య హామీలు, రాజకీయ పార్టీల ప్రజాస్వామీకరణ, అధికార వికేంద్రీకరణ వంటి సంస్కరణల్ని ఏకాభిప్రాయంతో తీసుకొస్తే, ఈసీ పని ఇంకా తేలికవుతుంది. సమస్య వర్ణనలు కాకుండా, హేతుబద్ధత, సాక్ష్యాలు, ప్రపంచ అనుభవాలు, మన దేశ పరిస్థితులు మొదలైన వాటి ప్రాతిపదికన పరిష్కారంలో భాగమవుదాం. ❖

# రైతులు VS ఐ.టి ఉద్యోగులు
# H-1B, టారిఫ్ లతో ట్రంప్ మైండ్ గేమ్.. మోదీ స్వదేశీ మంత్రం

**భారత** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వదేశంలో రేటింగ్ ఫిబ్రవరి 2025 కంటే ఆగస్టు నాటికి తగ్గిపోయిందని ర్యాండమ్ పోల్ తేల్చింది. ఒక జాతీయ ఛానల్ ఇటీవల సదరు వివరాలను చర్చా కార్యక్రమంగా ప్రసారం చేసింది. ఆరు నెలల క్రితం దేశంలో మోదీ రేటింగ్ 72% ఉండగా, ఆగస్టులో 58కి తగ్గింది. కొవిడ్ తర్వాత మోదీకి ఇలా రేటింగ్ తగ్గటం ఇదే మొదటిసారి అని వ్యాఖ్యాతలు తెలిపారు. అయితే గత 46 ఏళ్లుగా ఈ రకమైన దేశవ్యాప్త మూడ్ సర్వేను చేస్తున్న ఆ ఏజన్సీ ప్రతినిధి ఈ పరిణామాన్ని విశ్లేషిస్తూ.. వరుసగా అధికారంలో ఉండేవారి పట్ల సహజంగా ఉండే వ్యతిరేకతకు తోడు, మోదీ ఆదరణ కొంత తగ్గటానికి ఒక తక్షణ కారణాన్ని కూడా ఆయన పేర్కొన్నారు.

పాకిస్థాన్‌పై ఉరి సర్జికల్ స్ట్రయిక్స్, ఆ తర్వాత బాలాకోట్ వైమానిక దాడుల ప్రభావం సంవత్సరాల తరబడి ప్రజల మనసుల్లో కొనసాగి, మోదీ పార్టీని రాష్ట్రాల్లో, జాతీయ స్థాయి ఎన్నికల్లో గెలిపించాయి. అయితే పహల్గాం విషయంలో అలా జరగలేదని సర్వే నిర్వాహకుడు తెలిపారు. కేవలం నాలుగున్నర నెలల్లో పహల్గాం విజయం ప్రభావం తగ్గిపోయిందన్నారు. అంతేకాదు, కొంత నెగెటివ్‌గా కూడా మారిందన్నారు. ఇందుకు ప్రధాన కారణం – గెలిచే యుద్ధాన్ని మోదీ హఠాత్తుగా ఆపేయటం. పాకిస్థాన్‌కి గట్టిగా బుద్ధి చెప్పకుండా మోదీ వదిలేశారనే అభిప్రాయం బీజేపీ, మోదీ అభిమానుల్లోనూ నెలకొంది. దానికితోడు ఘర్షణ ఆగిందని అందరికంటే ముందుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించటం, తన మూలంగానే భారత్, పాక్‌ల మధ్య సైనిక దాడుల విరమణ జరిగిందని పదే పదే చెప్పుకోవటం, ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ప్రధాన నాయకుడు రాహుల్ ఆ అంశంపై మళ్లీ మళ్లీ నిలదీయటం ప్రజల్ని ప్రభావితం చేసింది. అయితే పహల్గాం విషయంలో మోదీ అనవసరంగా వెనక్కి తగ్గారన్న కోపం, నిరసన బీజేపీ ఓటర్లలో ఉన్నా.. వారు ప్రతిపక్షం వైపు మొగ్గు చూపటం లేదని సదరు సీనియర్ సెఫాలజిస్ట్ చెప్పారు.

అయితే భారత్ ప్రదర్శించిన సైనిక పాటవం, నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేస్తూ తన పేరును మోదీ చెప్పక పోవటంతో ట్రంప్ రష్యా నుంచి ముడిసరకు దిగుమతి పేరుతో అదనంగా సుంకాలు వేశారు. మనతో అత్యధిక వాణిజ్యం చేస్తూ ఎగుమతుల్లో అత్యధిక మిగులున్న, సాంకేతికంగా ఎంతో బలమైన అమెరికాతో వ్యవహారం చెడటం భారత ఆర్థిక వ్యవస్థను, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తాయని కొందరు నిపుణులు చెబుతున్నారు. చైనా, రష్యాలతో పోలిస్తే అమెరికా వైపు మొగ్గటం భారత్‌కి లాభదాయకమే.

వ్యాపారలాభం కోసం ట్రంప్ దేన్నయినా దిగమింగు కోగలరు. తమ దేశంలో భారీ సబ్సిడీలతో కొద్దిమంది రైతులు పండించిన ఆహార, ఇతర పంట ఉత్పత్తుల్ని భారతీయ మార్కెట్‌లో గుమ్మరించాలని తాను చేస్తున్న డిమాండ్‌ను భారత్ నిర్మొహమాటంగా తిరస్కరించటం ట్రంప్‌కి ఎక్కువ ఆగ్రహం తెప్పించింది. ఆ డిమాండ్‌కు తలొగ్గితే, వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న మన దేశంలోని సగం జనాభా జీవితాలు అల్లకల్లోలమవుతాయి. అమెరికా మన కంటే ఎన్నో రెట్లు సంపన్న దేశం, అమెరికా సుంకాల వల్ల వస్త్ర పరిశ్రమ తదితర రంగాల్లో పనిచేసే మన కార్మికులు చాలా ఇబ్బంది పడతారు. అదేవిధంగా ఎక్కువగా భారతీయ ఐటీ ఉద్యోగులకు అవకాశాలుండే యూఎస్ హెచ్ 1బీ వీసాకు 100,000 డాలర్ల ఫీజు విధించటం, భారతీయుల మీద ఎన్నడూలేనిరీతి విద్వేషాన్ని అమెరికాలో రగల్చటం మనకు అధికాదాయ మిచ్చే అక్కడి మన ఐటీ ఉద్యోగులకు, కొందరు విద్యార్థులకు కూడా కొంత ఇబ్బందికరం. ట్రంప్ విషయంలో మోదీ కాస్త లౌక్యంగా వ్యవహరిస్తే బాగుండేది కానీ,భారత్ ఎదగాలంటే మోకరిల్లటం కూడా సరికాదు. మన రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడితే, అది దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక సుస్థిరతకే ప్రమాదకరంగా మారే అవకాశముంది. ఈ విషయాన్ని మోదీ చాలా స్పష్టంగా ప్రకటించారు కూడా. ఒకరకంగా చెప్పాలంటే, రైతులు వర్సెస్ ఐటీ ఉద్యోగులుగా వాణిజ్యాన్ని ట్రంప్ మార్చారు. ఇంకా విచిత్రమేమంటే, రైతులకు సంకెళ్లు తెంచి వారి ఆదాయాన్ని కొంతయినా మెరుగు పరచటానికి ఉపయోగపడే, ప్రపంచ మార్కెట్‌లోకి వారు ప్రవేశించగలిగేందుకు దోహదం చేసే వ్యవసాయ చట్టాలను 2020లో మోదీ తీసుకొస్తే వ్యతిరేకించిన ప్రతిపక్షాలే ఇప్పుడు అమెరికా విషయంలో ఆయన్ని బలహీన ప్రధాని అని ఎద్దేవా చేస్తున్నాయి. అదేవిధంగా రైతులు మనకెందుకు అని వ్యవసాయం, పంటలకు ఆదాయాలు, గ్రామీణ చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం వంటి అంశాలను పట్టించుకోని ఐటీ, ఇతర అమెరికన్ ఇండియన్లకు ఇప్పుడు అవే పెద్ద సమస్యలుగా మారాయి. మన కెరీర్‌ను చూసుకుంటూ, సమాజం, ఇతర రంగాల్లోని వారి సమస్యలను కొంతైనా పట్టించుకోవాలని, రాజకీయం ప్రభావంలేని రంగమంటూ ఉండదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్),

లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ లాంటి వారు చెబుతున్న మాటలు ఎంత వాస్తవమో రుజువైంది. భారతీయులు చాలామంది అమెరికాలో గొప్ప సాఫ్ట్ పవర్‌గా ఎదిగారు గానీ, అలవాటు ప్రకారం రాజకీయాన్ని తక్కువ పట్టించుకున్నారు. రాజకీయ లాబీయింగ్ సామర్థ్యంతో ట్రంప్‌ను నియంత్రించలేకపోయారు.

రెండోది, ఇప్పుడు పరిస్థితులు పూర్తిస్థాయి రాజీకి కూడా అనుకూలంగా లేవు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని పుతిన్ కాదు, మోదీ చేస్తున్నారు, భారతీయులు అహంకారంతో మాట్లాడుతున్నారు వంటి భాషను పోటస్ ప్రధాన సలహాదారుడు పీటర్ నవారో అన్నాక, హెచ్-1 బీ ఫీజు ఉద్దేశపూర్వకంగా ఆ స్థాయిలో పెంచాక.. కొంత ప్రతిష్టంభన తప్పదు. నెమ్మదిగా సర్దుబాటు గావించుకోవాలి. ఒక పక్క అమెరికాతో వాణిజ్య సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నిస్తూనే, ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాల్ని విస్తరించుకోవాలి. స్వదేశీ మార్కెట్‌నూ భారీగా విస్తరించుకోవాలి. మన మార్కెట్ మూలాలు బలమైనవే గానీ, స్థాయి తక్కువ. ఆ కొనుగోలు స్థాయిని పెంచుకోవాలి. ఇది భారత్‌కి పెను సవాలే గానీ, అసాధ్యం కాదు.

**ట్రంప్ పాఠం**

ట్రంప్ నిర్ణయాలు మొత్తం అహేతుకమని కొట్టిపారేయలేం. అమెరికా కోణం నుండి చూస్తే, ఒక విధంగా ఆయన వాస్తవాలనే ప్రస్తావిస్తున్నారు. అదేవిధంగా, ట్రంప్ తీరు మనకి ఇబ్బందికరంగా అనిపించినా.. మనకి కొన్ని కనిపించని సానుకూలతలూ ఉన్నాయి.

ట్రంప్ భారతీయుల ఆత్మగౌరవం మీద కన్నా.. జడత్వం, జుగాడిజంపై గట్టి దెబ్బ తీశారనుకోవచ్చు. అవి రోగాలనుకుంటే, ఇవ్వాల్సిన మందు ఇచ్చారు, తగలాల్సిన చోట తన్నారు. ఈ క్రమంలోనే.. అమెరికా సుంకాల భారం వల్ల నష్టాన్ని పూడ్చుకోవటానికి, భవిష్యత్తులోనైనా ఏ ఇతర దేశం దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా ఉండేందుకు వివిధ దేశాలతో ప్రత్యక్ష ఒప్పందాలకు మోదీ హడావుడి పడుతున్నారు. ఈ అభిప్రాయాన్ని ఇటీవల ఓ బిజినెస్ పత్రిక సదస్సులో చెబుతూ, 'అడుగు తర్వాత అడుగన్నట్లు మార్పులు కాకుండా, పెద్ద సంస్కరణల కోసం ప్రయత్నిస్తున్నాం. తప్పదు కాబట్టి, మార్పులు తెస్తున్న ప్రభుత్వం కాదు మాది.. సంస్కరణల పట్ల నిజమైన నమ్మకంతో వాటి కోసం కృషి చేస్తున్నాం' అని మోదీ అన్నారు.

**బాల్-లాల్-పాల్ తో ప్రారంభం**

స్వదేశీ నినాదం భారత్‌కి కొత్త కాదు. స్వతంత్ర పోరాట కాలం నుంచి ఉంది. 1905లో బెంగాల్ విభజన జరిగి నప్పుడు బాలగంగాధర్ తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ (బాల్-లాల్-పాల్), అరవింద ఘోష్ తదితరులు ఈ పిలుపునిచ్చారు. ఆ తర్వాత మహాత్మాగాంధీ 1920లలో స్వదేశీ నినాదాన్నిచ్చి పెద్దఎత్తున ప్రజల్ని కదిలించారు. విదేశీ వస్తువుల్ని బహిష్కరించమన్నారు. జాతీయోద్యమ నాయకులు విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ఒక ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు.

ప్రస్తుతం మోదీ చెబుతున్న స్వదేశీ తయారీ, వినియోగం.. విదేశీ పెట్టుబడుల్నీ ఆహ్వానిస్తుంది. పిల్లి నల్లదా, తెల్లదా అనవసరం.. ఎలకల్ని పట్టాలి. 'భారతదేశ మట్టి మీద మీరు ఉత్పత్తి చేయండి, భారతీయ కార్మికుల చెమటతో ఉత్పత్తి చేయండి, ప్రపంచ దేశాల అవసరాల కోసం ఉత్పత్తి చేయండి' అని మోదీ పిలుపు నిచ్చారు. అదేవిధంగా, విదేశీ వస్తువులకు బదులు దువ్వెనతో సహా స్వదేశీకి ప్రాధాన్యతనివ్వాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సందేశం సుస్పష్టం - పెట్టుబడి ఎవరిదైనా భారత్ నుంచి వస్తువులు ఎగుమతుల్ని నిరంతరం పెంచుతుండాలి, దిగుమతుల్ని ఉన్నకొద్దీ తగ్గిస్తుండాలి, దేశీయ మార్కెట్ వాటాను పెంచాలి.

చైనాలో మావో సేటుంగ్ తర్వాత వచ్చిన డెంగ్ జియావో పెంగ్ తరహాను, సింగపూర్ వ్యవస్థాపకుడు లీ క్వాన్ యూ నమూనాను మోదీ ఎంచుకున్నారు. కానీ, అలాంటి మార్పులు రాత్రికి రాత్రి, ట్రంప్ నిర్ణయాలు మార్చుకున్నంత వేగంగా రావు. అందుకు తగ్గ వ్యవస్థల్ని, విధానాలని పకడ్బందీగా రూపొందించి ప్రజల్ని సన్నద్ధం చేయాలి, వారి తలసరి ఆదాయాల్ని పెంచాలి. కానీ మనమేం చేశాం? లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యంతో అభివృద్ధికి కావలసిన ఆర్థిక స్వేచ్ఛ లేకుండా చేశాం. ప్రజల్లో స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో ఉన్న ఆత్మగౌరవ భావాన్ని క్రమంగా చంపేశాం. చివరికి మోదీ కూడా..మౌలిక మార్పులు తేలేదు. రాజకీయ, పాలనా సంస్కరణలు తీసుకు రాకుండా కేవలం ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతులు, అభివృద్ధి వరకే పరిమితమయ్యారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ 2014 నుండీ హెచ్చరిస్తూనే ఉన్నారు.

**ఆత్మగౌరవం-ఆర్థికాభివృద్ధి-**
**స్వదేశీ కొనుగోలు శక్తి మధ్య పరస్పర ఆధారితం**

ప్రజల్లోని సృజనాత్మకతను పెంచే ఏర్పాట్లు చేయకుండా.. సంక్షేమం పేరుతో ప్రభుత్వం మీద ఆధారపడేవారిగా తయారు చేసే విధానాలను ప్రస్తుతం అవలంబించసాగాం. సంపద పెరగటం పంచటం కోసమే అనే భావాన్ని వ్యాప్తి చేశాం. ఉచిత పథకాలతో వారిని నిరంతరం అర్థించేవారుగా తయారు చేశాం. రిజర్వేషన్ల పేరుతో ఆ కులాల లోపల, బయట కులాల వారి మధ్యా చిచ్చు పెట్టాం. వారు ఆత్మగౌరవంతో ఎదగటానికి, ఒక తరం కాలంలో పేదరికం నుంచి బయట పడి ప్రపంచంలో ఎవరితోనైనా పోటీ పడటానికి కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, మౌలిక వసతులు, స్థానిక పట్టణీకరణ వంటి ప్రభుత్వం చేయాల్సిన పనుల్ని పట్టించుకోకుండా వదిలేశాం. ప్రజల్లో విద్యకి డిమాండ్ ఉంది

కాబట్టి, సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్, ఇంద్రా నూయి, నీల్ మోహన్, అజయ్ బంగా వంటి 1% లోపు వారిని చూపిస్తూ ఏదో చేస్తున్నట్లు నటిస్తున్నాం. పిల్లలు సొంతంగా ఆలోచించే, కొత్త సృజనలు చేసే విద్యను నిర్లక్ష్యం చేశాం. పునాదిగా ఉండాల్సిన బడి చదువును మొక్కుబడిగా మార్చేశాం. పోలీసుల్ని, దర్యాప్తు సంస్థల్ని ఎన్నికల ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటూ, ఓట్ల కొనుగోలుకు నల్లడబ్బు కూడబెడుతూ, కోర్టుల్లో కేసులు తెమలకుండా చేస్తూ చట్టబద్ధపాలనను గూండాలకు అప్పగించి చోద్యం చూస్తున్నాం. రైతులకు పంట పండినా, ప్రపంచ మార్కెట్లో ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నా ఇష్టమొచ్చినట్లు ఎగుమతులు దిగుమతుల్ని నియంత్రిస్తూ, సహకార సంఘాల్ని నియంత్రిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాం. నిజాయతీ, సామర్థ్యం, కష్టపడటంలో ప్రపంచంలో భారతీయులు ఎవరికీ తీసిపోకపోయినా.. అవి వికసించే స్థాయి ఎజెండాతో రాజకీయం, పాలన చేయకుండా వారిని పరాన్నజీవులుగా, ఎవరో ఏదో సాంకేతికత కనిపెడితే అనుకరించేవారుగా తయారుచేశాం. మెజారిటీ ప్రజలు ఆత్మగౌరవంతో వ్యవహరిస్తూ తమ శక్తిని వికసింప చేసుకుని, సంపద సృష్టిలో, వినియోగంలో ప్రపంచస్థాయిలో పోటీపడేలా చేయలేక పోతున్నాం. ట్రంప్ లాంటి వాళ్లు వస్తుంటారు, పోతుంటారు. కాస్త ఆలస్యంగానైనా రెండు ప్రజాస్వామ్య, సహజ భాగస్వామ్య దేశాలుగా భారత్, అమెరికా కలసి పనిచేస్తాయి. హెచ్ 1 బీ వీసా వంటి వాటి ఫీజు విషయంలోనూ పెద్ద సమస్యలు రావు. ఎందుకంటే, అప్పులు చేసి మరీ ప్రతివారూ అమెరికా వెళ్లనక్కర్లేదు. అంత అవసరం, అవకాశం ఉన్నవారికి సమస్య లేదు. అమెరికాతో సమానంగా లేదా మించి మనం కూడా విద్య, పరిశోధనా వ్యవస్థలను అభివృద్ధి గావించు కోగలిగితే ఆ అవసరం కూడా తగ్గుతుంది. కానీ మనం ఏం చేస్తున్నామో, ఎలాంటి రాజకీయం చేస్తున్నామో, ఎందుకోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నామో, చట్ట సభల్లోకి ఎందుకు అడుగు పెడుతున్నామో స్పృహలోకి వచ్చి ఆలోచించటానికి ఇదో గొప్ప అవకాశం. పెను సంక్షోభంలో గొప్ప అవకాశం దాగి ఉంటుందనటానికి ఇది సరైన ఉదాహరణ.

**వేగంగా సంస్కరణలు తేగలగాలి**

రాత్రికి రాత్రి ప్రజల్ని స్వావలంబన, స్వాభిమానం గల వారిగా, అధికాదాయాలు, వినియోగశక్తి కలవారిగా మనం చేయ లేకపోవచ్చు. కానీ వేగంగా సంస్కరణల్ని తేవాలి. విద్య, ఆరోగ్యాల్ని సమూలంగా మార్చి ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని, అత్యధిక ఉత్పాదక శక్తిని అందిద్దాం. ఆర్థిక రంగాన్ని సమ్మిళితం చేసి అభివృద్ధిని గణనీయంగా పెంచుదాం. ఓట్ల కొనుగోలు, రాజకీయ అవినీతి ఆగటానికి ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను మార్చి దామాషా పద్ధతిని తీసుకొద్దాం. ప్రజలకు తాత్కాలిక సాయం ఇవ్వనంటే ఎన్నికల్లో ఓడించటం అనే దుష్పరిణామం ఇప్పటికిప్పుడు మారదు కాబట్టి.. సంక్షేమం ఇస్తూనే అభివృద్ధికి పట్టం గడదాం. ఎట్టి పరిస్థితుల్లోనూ సంక్షేమానికి అప్పు చేయకుండా చట్టబద్ధ నిబంధనలు ఏర్పాటు చేసుకుందాం. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటిద్దాం. క్రమంగా మార్పు మొదలై మీరు ఇస్తామన్నా ప్రజలు తాయిలాలు తీసుకోరు. అదే విధంగా వినూత్న ఆలోచనలతో కొత్త నాయ కులు వచ్చేలా పార్టీల్ని ప్రజాస్వామీకరించి ప్రతిభనే గీటురాయిగా చేద్దాం. చట్టబద్ధపాలనలో నేరపరిశోధన పోలీసుల్ని రాజకీయాల నుంచి వేరు చేయటమే కాకుండా, న్యాయ వ్యవస్థను కూడా ప్రతిభావంతులతో జవాబుదారీగా ఉండేలా చేద్దాం. వీటితో పాటు అత్యంత కీలకమైన అధికార వికేంద్రీకరణ చేయటం అవసరం. స్థానిక ప్రభుత్వాలను వార్డు స్థాయి వరకూ ప్రజల భాగస్వామ్యంతో, జవాబుదారీతనంతో బలోపేతం చేద్దాం. అప్పుడు స్వదేశీ, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా సాకారమవుతాయి. స్వదేశీ అంటే, ఇతర దేశాలను అనుకరించటం కాదు.. సొంతంగా, సృజనాత్మకంగా ఆలోచించటం కూడా. అలా ఆలోచించి.. ఇతర దేశాల సాంకేతికతలను, వినియోగ వస్తువులను అనుకరించటం కాకుండా – ప్రత్యామ్నాయ, పర్యావరణహిత ఉత్పత్తులతో, కొత్త ఆర్థిక నమూనాతో ఆదాయాల్ని, స్వదేశీ మార్కెట్ స్థాయిని పెంచుకుందాం. ఇతర దేశాల మార్కెట్లనూ ఆకట్టుకుందాం.

ఈ మార్గంలో మనం ఎంత వేగంగా సంస్కరణలు తేగలం, ప్రజల, ముఖ్యంగా కొత్తతరం శక్తిసామర్థ్యాల్ని వికసింప చేసి వారి ఆత్మగౌరవాన్ని, స్వావలంబనను, సొంత ఆలోచనా శక్తిని ఎంత పెంచగలం అన్నదాని మీదే భారతదేశం సమ్మిళిత ఆర్థికాభివృద్ధితో తన సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వెలికి తీసుకోవటం, వందో స్వాతంత్ర్య దినోత్సవం నాటికి అభివృద్ధి చెందిన దేశమవటం ఆధారపడి ఉంటాయి. కొందరు భ్రమ పడుతున్నట్లు, మార్కెట్ కోసమో, మరో అవ సరం కోసమో ఇంకా జనాభాను పెంచు కోనక్కర్లేదు. మన జననాల రేటు క్రమంగా అన్ని రాష్ట్రాల్లో స్థిరత్వాన్ని సాధి స్తోంది. రాజకీయ సంకల్పం ఉంటే, ఉన్నవారితోనే భారతదేశం తన లక్ష్యాన్ని సాధించగలదు. మనపౌరుషాన్ని భావోద్వేగాలకు, సోషల్ మీడియా వీరంగాలకు పరిమితం చేయకుండా, మన చేత ఈ పనుల్ని గనక సాధింప చేయగలిగితే, ట్రంప్‌కి నిజంగా నోబెల్ బహుమతి ఇచ్చినా మనకు అభ్యంతరం అక్కర్లేదు. ఎందుకంటే, భారత్ గెలిస్తే ఓడిపోయేదెవరు? ప్రపంచాన్నే గెలిపించే శక్తి, సంస్కృతి భారతదేశానికి ఉన్నాయి. అయితే, సంపద సృష్టించేది ప్రభుత్వాలు కాదు.. ప్రజలు అని మోదీ ప్రభుత్వం ఇప్పుడు గుర్తించిన పరమ సత్యాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు పైన పేర్కొన్న సంస్కరణల్ని చిత్తశుద్ధితో, త్వరితగతిన తీసుకొచ్చినప్పుడు మాత్రమే లక్ష్యం ఆచరణ రవుతుంది. ★




# చుక్కా రామయ్య గణిత పురస్కారం ప్రదానం

హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్.ఆర్.ఎఫ్) వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాండాల రాజకుమార్ కు 'చుక్కా రామయ్య గణిత పురస్కార్'ను ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రదానం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వడపర్తి గ్రామంలోని శ్రీనివాస రామానుజన్ హైస్కూల్ కి రాజకుమార్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తూ, గణితం బోధిస్తున్నారు. ప్రతి సంవత్సరం పదవ తరగతి వార్షిక పరీక్షల్లో గణిత విభాగంలో 100% ఉత్తీర్ణత అందించినందుకు ఈ అవార్డు అందించారు. పలువురు ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.














RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th October, 2025 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




బనకచర్ల ప్రాజెక్టును జేపీ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?
రాయలసీమకు నీళ్లు ఎలా ఇవ్వాలని సూచిస్తున్నారు?

Watch @
https://www.youtube.com/
@JPLoksatta Official

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**